జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*








సంపుటి 4 సంచిక 122 | హైదరాబాద్, ఫిబ్రవరి 19 శుక్రవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00


## 'పరీక్ష పే చర్చ' ఈసారి విభిన్నంగా:మోదీ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 18, ప్రజాపాలన : వార్షిక పరీక్షల ముందు విద్యార్థులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే సంభాషణ కార్యక్రమం మళ్లీ ప్రారంభం కాబోతోంది. ఈ విషయాన్ని మోదీ గురువారం ప్రకటించారు. కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో ఈసారి 'పరీక్ష పే చర్చ'ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ఈ కార్యక్రమం మార్చిలో జరుగుతుంది. ఈసారి విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కాబోతున్నారు. మోదీ గురువారం ఇచ్చిన ట్వీట్‌లో, ప్రజల డిమాండ్ మేరకు పరీక్ష పే చర్చ, 2021లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను కూడా భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. మిగతా 3లో..

## త్వరలో భూముల డిజిటల్ సర్వే:కేసీఆర్



హైదరాబాద్,ఫిబ్రవరి 18, ప్రజాపాలన : ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే డిజిటల్ సర్వే చేసి, వ్యవసాయ భూములకు కో ఆర్డినేట్స్(అక్షాంశ రేఖాంశాలు) ఇస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. సర్వే కోసం వెంటనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి పారదర్శకంగా జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో శ్రమించి, ప్రవేశ పెట్టి, అమలు చేస్తున్న ధరణి పోర్టల్ నూటికి నూరు పాళ్లు విజయవంతమయిందని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూలో సంస్కరణలు తెచ్చిన ఫలితంగా, రెవెన్యూ శాఖ పని విధానంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని, ఈ నేపథ్యంలో ఆ శాఖ అధికారులు భవిష్యత్తులో నిర్వహించాల్సిన విధులకు సంబంధించి జాబ్ చార్టు రూపొందించనున్నట్లు వెల్లడించారు. రెనెన్యూ సంస్కరణలు, ధరణి పోర్టల్ పనితీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ సోమేశ్ కుమార్, ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, కార్యదర్శులు స్మితా సభర్వాల్, భూపాల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలను సీఎం ప్రకటించారు.

ధరణిలో నమోదైన భూములను మాత్రమే అమ్మే, కొనే వీలు..

"ధరణి పోర్టల్ వల్ల రెవెన్యూలో అవినీతి అంతమయింది. నోరులేని, అమాయకుల రైతులకు న్యాయం జరిగింది. ఒకరి భూమిని ఇంకొకరి పేరు మీద రాసే అరాచకం ఆగింది. జుట్టుకు జుట్టుకు ముడేసి పంచాయతీ పెట్టే దుష్ట సంప్రదాయం ఆగింది. డాక్యుమెంట్లు గోల్ మాల్ చేసి, రెవెన్యూ కోర్టుల పేరిట జరిగే దుర్మార్గం పోయింది. దేశంలో మరెక్కడా లేని విధంగా, చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ప్రభుత్వం ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి మూడేళ్లు కసరత్తు చేసి కొత్త చట్టం తెచ్చింది. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు పారదర్శకంగా, అవినీతికి ఏమాత్రం అవకాశం లేకుండా జరిగిపోతున్నాయి. ఎలాంటి గందరగోళం, అస్తవ్యస్తం లేకుండా భూముల అమ్మకాలు, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతున్నది. బయోమెట్రిక్, ఆధార్ ఆధారంగా అమ్మేవారు, కొనేవారు వస్తేనే భూముల రిజిస్ట్రేషన్ జరుగుతున్నది. ధరణిలో నమోదైన భూములను మాత్రమే అమ్మే, కొనే వీలున్నది. మిగతా 3లో..

## న్యాయవాది దంపతుల హత్యకేసును సుమోటోగా స్వీకరించిన హైకోర్టు



హైదరాబాద్,ఫిబ్రవరి 18, ప్రజాపాలన : న్యయవాదులైన గట్టు వామన్‌రావు, పీవీ నాగమణి దంపతుల హత్య కేసును హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ హత్యకు సంబంధించిన అన్ని ఆధారాలు పకడ్బందీగా సేకరించాలని అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది మార్చి 1వ తేదీ లోపు సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఏజీని ఆదేశించిన హైకోర్టు.. ప్రభుత్వానికి, పోలీసు శాఖకు నోటీసులు జారీ చేసింది. హత్య జరిగిన చోట అన్ని ఆధారాలను సేకరించి, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుపాలని ఆదేశించింది. హత్య జరిగిన సమయంలో అక్కడున్న ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులను గుర్తించి.. వాళ్లను సాక్షులుగా చేర్చాలని కోర్టు తెలిపింది. హత్యకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని, వాటిని భద్రపరచాలని సూచించింది. తదుపరి విచారణను మార్చి 1వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

పోలీసు శాఖ అప్రమత్తం : ఏజీ

న్యాయవాదులైన వామన్‌రావు, నాగమణి హత్య జరిగిన వెంటనే పోలీసు శాఖ అప్రమత్తమైందని కోర్టుకు అడ్వకేట్ జనరల్ తెలిపారు. హంతకులను అతి త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఆయన కోర్టుకు చెప్పారు.

షాక్‌కు గురయ్యాం : సీజే

న్యయవాది వామన్‌రావు, ఆయన సతీమణి నాగమణి హత్యతో షాక్‌కు గురయ్యామని హైకోర్టు చీఫ్ జస్టిస్ హిమా కోహ్లీ అన్నారు.

## 2020 ట్రీ సిటీగా హైదరాబాద్..




హైదరాబాద్,ఫిబ్రవరి 18, ప్రజాపాలన :ఆకుపచ్చ తెలంగాణ కోసం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అహర్నిశలు కష్టపడుతున్నారు. ఇందుకోసం హరితహారం అనే కార్యక్రమాన్ని చేపట్టి కోట్ల సంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విజయవంతంగా కొనసాగుతున్న హరితహారంతో తెలంగాణ పుడమి తల్లి ఆకుపచ్చగా మారుతోంది. ఎక్కడ చూసినా పచ్చదనమే పలుకరిస్తోంది. హరిత తెలంగాణ కోసం ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మరో అరుదైన గుర్తింపు లభించింది.ఆర్బర్ డే ఫౌండేషన్ అనే సంస్థ.. 2020 ట్రీ సిటీగా హైదరాబాద్‌ను ప్రకటించింది. హరితహారం విజయవంతం అయిందనడానికి ఈ గుర్తింపే నిదర్శనం. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. ట్రీ సిటీ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను ఆర్బర్ డే ఫౌండేషన్ గుర్తించడం చాలా సంతోషంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆర్బర్ డే ఫౌండేషన్ ట్రీ సిటీ జాబితాలో ఇండియా నుంచి హైదరాబాద్ నగరం ఒక్కటే ఎంపిక కావడం విశేషం. హరితహారం కార్యక్రమంలో భాగంగా పచ్చదనాన్ని పెంచేందుకు తాము చేసిన ప్రయత్నాలకు ఇది గుర్తింపు అని కేటీఆర్ అన్నారు. హరితహారంలో భాగంగా హైదరాబాద్‌లో 2020 ఏడాది వరకు 2.4 కోట్ల మొక్కలు నాటినట్లు ఆర్బర్ డే ఫౌండేషన్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.



## ఏప్రిల్ 1 నుంచి కుంభమేళా

డెహ్రాడూన్ : కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కుంభమేళా జరిగే రోజులను తగ్గించాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది కుంభమేళాను కేవలం 30 రోజులు మాత్రమే నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాశ్ గురువారం ఉదయం వెల్లడించారు. కుంభమేళా నిర్వహణకు సంబంధించి మార్చి చివరినాటికి ప్రకటన విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు కుంభమేళాను నిర్వహించనున్నారు. అయితే కుంభమేళాకు తరలివచ్చే భక్తులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలి. ఈ రిపోర్టులో నెగిటివ్ వస్తేనే కుంభమేళాకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. కొవిడ్ రిపోర్టు లేకపోతే ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఉండదని తేల్చిచెప్పారు. భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు ఘాట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కుంభమేళాను ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. అయితే కుంభమేళా జనవరి రెండో వారంలో ప్రారంభమై ఏప్రిల్ చివరికి ముగుస్తుంది. కానీ కరోనా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ సారి కేవలం 30 రోజులకే పరిమితం చేశారు.

## జాతీయస్థాయిలో ఆ ఘనత ఎన్టీఆర్‌దే:వెంకయ్యనాయుడు



హైదరాబాద్,ఫిబ్రవరి 18, ప్రజాపాలన : వ్యక్తిగా, రాజకీయ శక్తిగా ఎన్టీఆర్‌ది విలక్షణమైన వ్యక్తిత్వమని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ రాజకీయ జీవితంపై సీనియర్ జర్నలిస్ట్ రమేష్ కందుల రచించిన రాజకీయ జీవిత చరిత్ర 'మావెరిక్ మెస్సీయ' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామా రావు గారి స్మృతికి ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు ఘన నివాళులు అర్పించారు. నటుడిగా, రాజకీయ వేత్తగా ప్రజల హృదయాల్లో గొప్ప స్థానాన్న సంపాదించుకున్న ఎన్టీఆర్ ది రాజకీయ యవనికపై ఓ శకమని తెలిపారు. ఎన్టీఆర్ రాక రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేసిందన్న ఆయన ఎన్టీఆర్ విషయంలో ప్రజలంతా ఏకమై అధికారాన్ని కట్టబెట్టారని, నిజమైన ప్రజాస్వామ్య భావనకు నాంది పలికారని తెలిపారు. నాటి అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజకీయ సంస్కృతిని ఎన్టీఆర్ పునర్నిర్వచించారన్న ఉపరాష్ట్రపతి, సరికొత్త రాజకీయాలకు నాంది పలికిన ఆయన జీవితాన్ని పుస్తక రచయిత చక్కగా వివరించారని పేర్కొన్నారుప్రత్యామ్నాయ రాజకీయాలకు ఎన్టీఆర్ మార్గనిర్దేశనం చేశారన్న ఉపరాష్ట్రపతి, రాజకీయాల్లో ఎన్టీఆర్ రాక, ప్రాంతీయ పార్టీ ద్వారా తొమ్మిది నెలల్లోనే సాధించిన చారిత్రక విజయం, జాతీయ రాజకీయాలకు సరికొత్త దిశను చూపించిందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఉప-జాతీయవాద సిద్ధాంతం నిర్మాణాత్మకమైన పాత్ర పోషించిందన్న ఉపరాష్ట్రపతి, వారి అన్ని ప్రాంతాల అభివృద్ధి సిద్ధాంతం భారతదేశంలోని ఎంతో మందిని ఆలోచింపజేసిందని తెలిపారు. మిగతా 3లో..

## కేసీఆర్ ప్రేరేపించడం వల్లే వామనరావు దంపతుల హత్య: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రేరేపించడం వల్లే న్యాయవాద దంపతులు వామనరావు, నాగమణి హత్య జరిగిందని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నడిరోడ్డుపై పట్టపగలే వామనరావు దంపతులను హత్య చేశారని మండిపడ్డారు. వామనరావు దంపతుల హత్య కేసులో టీఆర్ఎస్ నేతలు పుట్టా మధు, కుంట శ్రీను పాత్రధారులు మాత్రమేనని చెప్పారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే చంపేస్తామని ప్రభుత్వ పెద్దలే చెబుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హాలియా సభలో ప్రతిపక్షాలను తొక్కేస్తామన్నారన్నారు. టీఆర్ఎస్ నేతల అక్రమాలపై వామనరావు దంపతులు కేసులు వేసి పోరాడుతున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు.పట్టపగలే నడిరోడ్డుపై వామనరావు, నాగమణి హత్య దారుణంగా హత్య చేశారు. కారులో వెళ్తున్న న్యాయవాద దంపతులను దుండగులు మరో కారులో వచ్చి అడ్డుకున్నారు.. కారులోంచి న్యాయవాదిని బయటకు లాగి కత్తులు, గొడ్డళ్లతో విచక్షణారహితంగా నరికి చంపారు. కారులో ఉన్న ఆయన భార్యపైనా కత్తులతో దాడి చేసి ప్రాణాలు తీశారు.




## బాలుడి చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం



శేరిలింగంపల్లి, ప్రజాపాలన : శ్రీ శ్రీ మహంకాళి విశ్వకర్మ సంఘం అధ్యక్షులు కే కృష్ణమూర్తి చారి రామచంద్రాపురం లో నివాసం ఉంటున్న సంగమేశ్వర చారి మేనల్లుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో అడ్మిట్ చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న కృష్ణ మూర్తి చారి ఆ పిల్లవాడి చికిత్స కొరకు ఆర్థిక సాయం అందజేశారు. గత ఐదు రోజులుగా చాలా డబ్బులు ఖర్చు అయ్యాయని, ఇప్పుడు వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు అని తెలిసి, కే కృష్ణమూర్తి చారి, మరియు వారి తమ్ముడు రాజేందర్ చారి లు వారికి ఆర్థికంగా మనస్ఫూర్తిగా తమ వంతు సహాయంగా 5000 రూపాయలు సహాయం చేయడం జరిగిందని వారు తెలిపారు. మిగితా ఎవరైనా మీకు తోచిన సహాయం చేయలని ఆయన కోరారు. మంచి చికిత్స పొంది త్వరలో ఆ అబ్బాయి కోలుకోవాలని ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## హబ్సిగూడలో వినీజ్ కెపే కాఫీ షాప్ ప్రారంభోత్సవం



మేడిపల్లి, ఫిబ్రవరి18 (ప్రజాపాలన) : హబ్సిగూడ మెయిన్ రోడ్ ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా విజయలక్ష్మి ఆర్కేడ్ మొదటి అంతస్తులో "వినీజ్ కెపే" కాఫీ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార ప్రియులకు రుచికరమైన కాఫీతో పాటు నాణ్యమైన స్టాఫ్ ను అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొప్రైటర్ వినయ్ కుమార్ రెడ్డి, స్థానిక టిఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం రవి కుమార్, లక్ష్మీనారాయణ, కట్ట బుచ్చన్న గౌడ్ , పరిటాల సాంబశివరావు, షగ రవీందర్, కృష్ణారెడ్డి, లింగ నాయక్, నాని, టీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

## కోట చంద్రయ్య కుటుంబానికి స్విమ్మర్స్ అశోషియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన : ఇటీవల మధిర చెరువు లో అకస్మాత్తుగా కాలు జారిపడి మృతిచెందిన కోట చంద్రయ్య కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితి ని గమనించి మధిర స్విమ్మర్స్ అశోషియేషన్ అధ్యక్షులు జంగా నర్సిరెడ్డి ఆధ్వర్యంలో స్విమ్మింగ్ సభ్యులు అందరూ కలిసి తమ వంతు సహాయంగా 8,116 /- లు చెరుకూరి కృష్ణారావు చేతులు మీదుగా చంద్రయ్య భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాద్, చల్లా సత్యనారాయణ, సంతోష్, అప్పారావు, సైదులు, కోటేశ్వరరావు, ఆదాము, కిషోర్, మరియు మధిర స్విమ్మర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి



పాలేరు ఫిబ్రవరి 18 ప్రజాపాలన :ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి గావు పరిధిలోని ఇందిరమ్మ కాలనీ పేస్-1 సందర్శించి,తెరాస పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ కోసం కెసిఆర్ అనేకవిధాల శ్రమిస్తున్నారని. బంగారు తెలంగాణ కోసం మనందరం కేసీఆర్ అడుగుజాడల్లో నడవాలని. పార్టీ సభ్యత్వం ద్వారా దురదృష్టవశాత్తు. జరగరానిది జరిగితే రెండు లక్షల రూపాయల బీమా సౌకర్యాన్ని కెసిఆర్ ప్రవేశపెట్టారని ప్రతి ఒక్కరూ ఇది పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో రూరల్ ఎంపీపీ బెల్లం ఉమా, రూరల్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు

## సివిల్ సప్లై హమాలి కార్మికుల నిరవధిక సమ్మె

### రేట్ల ఒప్పంద జీవోను వెంటనే జారీ చేసి అమలు చేయాలని డిమాండ్



మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 18, ప్రజాపాలన :సివిల్ సప్లై హమాలి కార్మికులు గురువారం నిరవధిక సమ్మె చేపట్టారు. హమాళి రేట్ల ఒప్పంద జీవోను వెంటనే జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏ ఐ టి యు సి,సి ఐ టి యు సి) బెల్లంపల్లి జిల్లా మంచిర్యాల్ కమిటీ ఆధ్వర్యంలో సివిల్ సప్లై కార్మికుల రేట్ల ఒప్పందం జరిగి నాలుగు నెలలు కావస్తున్నా అధికారులు ఇప్పటివరకు జీవో విడుదల చేయలేదని పేర్కొన్నారు. ఏ ఐ టి యు సి తరుపున 1500 మంది సివిల్ సప్లై హమాలి కార్మికులు సుందరయ్య పార్క్ లో ధర్నా చేసి సివిల్ సప్లై ఆఫీసును గతంలో ముట్టడించిన అప్పుడు సివిల్ సప్లై కమిషనర్ ఇతర అధికారులు నాలుగు రోజుల్లో లో జీవో విడుదల చేసి అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచి పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమ్మెలో వి చంద్రశేఖర్, కే .నారాయణ, జి. మొగిలి, బి. రవి కే .సతీష్ ,ఈ. రమేష్ కె. నరేష్ ఎన్. సత్తయ్య ,సిహెచ్ .రాములు, ఎల్. శివ, కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా పాలన : అవినీతిని ప్రశ్నిస్తే పట్టపగలు నడిరోడ్డుపై అమానుషంగా, పైశాచికంగా న్యాయవాదులు వామనరావు-నాగమణి దంపతులను టిఆర్ఎస్ గుండాలు చంపడం ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే. నిందితుల పక్షాన ఏ న్యాయవాది వాదించ వద్దు కేసీఆర్ జన్మదిన సందర్భంగా ఒక్క ఉన్నత విద్యావంతుని న్యాయవాదులను హత్య చేసి టిఆర్ఎస్ పార్టీ నాయకులు కెసిఆర్ కు బర్త్ డే కానుకనా. బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పెద్దపల్లి జిల్లాలో జరిగిన హైకోర్ట్ అడ్వొకేట్ దంపతుల హత్యను ఖండిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద టిఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను మాజీ మున్సిపల్ చైర్మన్ జిల్లా దిశా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె జహంగీర్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ లకు దేశములోనే గౌరవం ఉన్నది అగౌరవని తీసుకోకుండా రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి న్యాయవాదులు మాకు ప్రాణభయం ఉందని పోలీసులకు తెలియజేసిన పట్టించుకోక పోవడం వల్ల ఇది ముమ్మాటికి పోలీసులు, టిఆర్ఎస్ నాయకుల పథకం ప్రకారమే హత్య జరిగినది హత్యలో టిఆర్ఎస్ పెద్ద నాయకుల కుట్ర తెలియాలంటే సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తూ రాష్టంలో టిఆర్ఎస్ పార్టీ ఆరాచకాలు రోజు రోజు పెరిగిపోతున్నాయ్ ప్రశ్నించే గొంతులను అడ్డుతొలగించడానికి టిఆర్ఎస్ పార్టీ హత్యలకు కూడా వెనుకాడటం లేదు ఒక మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఉదయం కేసీఆర్ బర్త్డే లో పాల్గొని మధ్యాహ్నం హత్యలో పాల్గొనడం దారుణం ఇతను అనుచరులు అనేక ప్రజావ్యతిరేక కార్యక్రమంలో భాగస్వాములు అవుతూ ఆ ప్రాంతంలోని ఇసుక మాఫియా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే దళిత మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన యువకులను అక్రమ కేసులలో పోలీస్ స్టేషన్ లో పెట్టి లాక్ అప్ డెత్ లు చేయించటం రౌడీ లాగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం పోలీసుల దృష్టికి తీసుకొచ్చిన పట్టించుకోక మూలంగానే హత్య ఈహత్య వెనుక ఎంత పెద్ద వాళ్ళు ఉన్న వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ బంగారు తెలంగాణ అని హత్యలతో బ్రష్టు పట్టిస్తున్నారు రాక్షసపాలను అంతమందించే రోజులు దగ్గర పడ్డాయ్ ఇప్పటికైనా మేధావులు యువకులు పార్టీలకతీతంగా టిఆర్ఎస్ పార్టీని,ప్రభుత్వాన్ని [illegible] వ్యతిరేకించండి,మీఅందరికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ ఈరపాక నరసింహ,వడిగెల ప్రదీప్,కాంగ్రెస్,యువజన కాంగ్రెస్,ఎన్ ఎస్ యు ఐ నాయకులు సుజాత అలీ కౌసర్,ఎండి అమానాథ్,ఎండి కబీర్,ముచ్చర్ల మనోజ్ యాదవ్,కొల్లూరు రాజు, కాకునూరి మహేందర్,పుట్ట గిరీష్ గౌడ్, సాల్వేర్ ఉపేందర్,సిరివంగ చందు,పిల్లి సాయి కుమార్,బెండే శ్రీకాంత్,వడిచర్ల శరత్ యాదవ్,బెండ్ సిద్దార్థ,దర్లాయి దేవేందర్,బిళ్ళ నగేష్,మనోజ్,బర్రె వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సీబీఐ ద్వారా విచారణ చేపట్టాలి

### బార్ అసోసియేషన్ అధ్యక్షులు నికోడే రవీందర్

### న్యాయవాద దంపతుల హత్యను ఖండించిన బార్ అసోసియేషన్ విధులు బహిష్కరించి నిరసన తెలిపిన న్యాయవాదులు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి18, (ప్రజాపాలన): హైకోర్టు న్యాయవాద దంపతులు వామన్ రావు, నాగమణి, లను అతి దారుణంగా నడిరోడ్డుపై హత్య చేసిన ఘటనపై సి.బి.ఐ, చే విచారణ జరిపించాలని, ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నికోడే రవీందర్ డిమాండ్ చేశారు. పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల శివారులో బుధవారం మధ్యాహ్నం హైకోర్టు న్యాయవాద దంపతులు వామన్ రావు, నాగమణి, దంపతుల, హత్యను ఖండిస్తూ దుండగులను కఠినంగా శిక్షించాలంటూ గురువారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యయంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల దంపతులనే నడిరోడ్డుపై నరికి చంపే ఘటనలు జరుగుతుంటే, ఇక సామాన్య ప్రజలకు,రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. న్యాయవాద దంపతుల హత్యకు కారకులైన వారిని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హత్యను నిరసిస్తూ గురు, శుక్ర, రెండురోజులు న్యాయవాదులు విధులను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో న్యాయవాదులు తాటి పెల్లి సురేష్, రాజి హైదర్, వెంకటేశ్వర్లు, పంచదార దీపక్ రావు, సంఘర్ష్ శ్రీనివాస్ రావు, జగన్మోహన్ రావు, విద్యాసాగర్, రాజీవ్ రెడ్డి, శ్యామ్ కుమార్, చంద్ర కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలను శ్రమ దోపిడీకి గురి చేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి18,(ప్రజాపాలన):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 2 వ తేదీన కార్మిక సంఘాల నాయకులతో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం సివిల్ సప్లై హమాలి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి ఉపేందర్ పేర్కొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కార్మికుల హక్కుల సాధనలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్ ఎల్ ఎస్, పాయింట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ సివిల్ సప్లై, జీసీసీ హమాలీ కార్మికుల తో ఒప్పందం 2019 డిసెంబర్ తో ముగిసిందని, 2020 జనవరి నుండి నూతన రేట్లను పెంచాల్సిన ప్రభుత్వం కార్మికులకు కాలయాపన చేస్తూ మోసం చేస్తోందన్నారు. కరోనా సమయంలో కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిత్యం పేద ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని రెడ్ జోన్ లకు వెళ్లి సరఫరా చేశారన్నారు. సీఎం హమాలీ కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 12, 13, వ తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేయడం జరుగుతుందని, అప్పుడు సివిల్ సప్లై కమిషనర్ కార్మిక సంఘాల నాయకులతో నవంబర్ 2వ తేదీన చర్చలు జరిపి సమస్యలపై అనుకూలంగా స్పందించారన్నారు. ఎగుమతి, దిగుమతి, నూతన రేట్లు రూ 23 ప్రతి కార్మికునికి ఈఎస్ఐ, పిఎఫ్, పెన్షన్, సౌకర్యాన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్, మహిళా కార్మికులకు నెలకు రూ 5 వేల వేతనం, బోనస్ 6 వేలు, తదితర డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మూడు హామీ ఇచ్చి 3 నెలలు అవుతున్న ఒప్పందానికి సంబంధించిన జూన్ విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా సీఎం వెంటనే స్పందించి హామీల అమలుకు జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి ఏమాజీ, మండల కార్యదర్శి దివాకర్, కార్మికులు వెంకటేష్, బాపూజీ, తుకారాం, మోహన్, తిరుపతి, సురేష్, శ్రీనివాస్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలను ప్రారంభించిన మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల, ఫిబ్రవరి 18 (ప్రజాపాలన) :జగిత్యాల అర్బన్ మండల్ అంబారిపెట్ కల్లెడ పొలాస రైతు వేదికలను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం మోతే గ్రామానికి చెందిన రైతు కనుక లక్ష్మణ్ ఇటీవల మరణించగా లక్ష్మణ్ భార్య కనుక రాజేశ్వరికి 5 లక్షల చెక్కును మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రవి రూరల్ ఎంపీపీ గజర్ల గంగారాం గౌడ్ అర్బన్ ఎంపీపీ మెదరి అనిత జడ్పీటీసీ సంగెపు మహేష్ ఏఎంసి చైర్మన్ దామోదర్ రావు ప్యాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి రైతుబంధు కో ఆర్డినేటర్ జుంబర్తి శంకర్ సర్పంచ్ గంగాధర్ ఎంపీటీసీ మల్లారెడ్డి రైతు బంధు సమితి నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు నాయకులు రైతులు పాల్గొన్నారు

## సారంగాపూర్ లో రైతు వేదిక క్లస్టర్ భవనం ప్రారంభం




సారంగాపూర్, ఫిబ్రవరి 18 (ప్రజాపాలన): సారంగాపూర్ మండలంలోని కొనాపూర్ సారంగాపూర్ గ్రామాల్లో రైతు వేదికలను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అందరు సమూహంతో కలిసి కట్టుగా మాట్లాడుకునే మంచి వేదిక అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ జి. రవి జిల్లా వ్యవసాయాధికారి సురేష్ ఎంపీపీ కోల జమున జడ్పీటీసీ మేడిపల్లి మనోహర్ రెడ్డి తహశీల్దార్ శ్రీలత ఎంపీడీవో పుల్లయ్య మండల వ్యవసాయ అధికారి తిరుపతి నాయక్ సర్పంచులు ఆకుల జమున బొడ్డుపల్లి రాజన్న గుర్రాల రాజేందర్ రెడ్డి ఎంపీటీసీలు జోగినపల్లి సుధాకర్ రావు ఏలేటి మమత మనాల ప్రసన్న మాల సొల్లు సురేందర్ బుక్య లావణ్య ప్యాక్స్ చైర్మన్స్ గుర్నాథమ్ మల్లారెడ్డి ఏలేటి నరసింహా రెడ్డి రైతు సమన్వయ మండల్ కన్వీనర్ కోలా శ్రీనివాస్ సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు నాయకులు తెరాస కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టా భూముల్లో.. వైకుంఠ దామం



ఖమ్మం, 18 ప్రజాపాలన :ప్రభుత్వ కాళీ భూముల్లో వైకుంఠధామాల నిర్మించాలనేది ప్రభుత్వ సంకల్పం అయితే అందుకు భిన్నంగా పట్టా భూముల్లో వైకుంఠ దామం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టటం తో భూముల కు చెందిన రైతులు అడ్డుకొన్న ఘటన వివాదాస్పదం అయింది. అధికారుల చర్యను నిరసిస్తూ బాధిత మహిళా వంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం లో చోటుచేసుకున్న భూవివాదం ఎలాంటి పరిణామాలకు దారితీయనుందోనన్న వాదనలు వ్యక్తం అవుతున్నాయి ఇల్లందులపాడు ఏరియాలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఊన్నాయి. ఇల్లందు లపాడు ప్రాంతానికి చెందిన షేక్ యాకూబ్ బి,షేక్ సైదాబీ,మీరంభి లకు మూడెకరాల భూమిఉంది. చెరువు పరిధిలోని భూమి 1962లో యాకూబ్ బి అనే మహిళ పేరుతో పట్టాఉంది. ఆమె వారసులైన సైదాబీ, మీ రాం బి, లకు పట్టా ఉన్నది. ఈ భూమి ఇల్లందులపాడు చెరువు శిఖం భూమి. అయినందున ఆనాడు నిరుపేదలకు పంచి పట్టా ఇచ్చినటువంటి భూమి అని రైతులు చెబుతున్నారు. అయితే భూమిని దున్నుకో కుండా పశువుల గడ్డి కోసం వదిలిపెట్టారు. దాంతో ఖాళీగా భూమి అయినందున స్థానిక ప్రజాప్రతినిధి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ భూమిపై పూర్వాపరాలు తెలుసుకోకుండానే సదరు అధికారులు వ్యకుంటాదామానికి సెలెక్ట్ చేశారు అంతటితో అగకుండానే పనులు ప్రారంభించారు దీంతో భూమి పట్టాదారులు గగ్గోలు పెడుతూ పనులను అడ్డుకొన్నారు అయినా అధికారులు పట్టువిడటం లేదు వైకుంఠ దామం నిర్మించితిరాలసిందేనని అంటున్నారు. బాధితులు సైతం పట్టుదలతో వున్నారు తమ భూమిని ఎట్టి పరిస్థితిలో వదులుకొనేది లేదని అంట్టున్నారు.

# వార్డెన్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కి ఎస్ఎఫ్ఐ వినతి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి18, ప్రజాపాలన :విద్యార్థిని మృతికి కారణమైన వార్డెన్, సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కు ఎస్ఎఫ్ఐ,టిఏవిఎస్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. మంతి జిల్లా పర్యటన లో బాగంగా బెల్లం పెల్లి వచ్చిన సందర్భంగా ఆమెను కలిసి సంఘం వివరాలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని ఇంటీగ్రెటెడ్ గర్ల్స్ హాస్టల్ లో 9వ తరగతి చదువుతున్న బత్తుల మనిషా గుడిపల్లి గ్రామం , మందమర్రి మండలానికి చెందినా విద్యార్థిని ఈ నెల 12 న అనుమానాస్పదంగా మృతి చెందడం జరిగిందని గుర్తుచేశారు. ఐతే పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవలసిన అధికారులు బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విచారణ పేరుతో కాలం వెల్లదీస్తున్న ఎస్సీ సాంఘిక సంక్షేమ జిల్లా అభివృద్ధి అధికారినీ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటన పై స్పందించి విద్యార్థి కుటుంబానికి 20 లక్షల రూపాయులు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. పూర్తి విచారణ చెసి భాద్యులపైన చర్యలు తిసుకోవాలని లెని యెడల జిల్లా వ్యాప్తంగా అందోళన కార్యక్రామాలు చేపడతామని పేర్కొన్నారు. అదేవిధంగా మంచిర్యాల జిల్లాలో మారుమురు గిరిజన తండాల్లో ఉంటున్న గిరిజన విద్యార్థులకు జిల్లాలో గిరిజన గురుకులలు లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, జిల్లాలో గిరిజన గురుకులాలను ఏర్పాటు చేయాలని కోరారు. అద్దె భవనంలో ఉన్నటువంటి గిరిజన సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు. విద్యార్థి మృతి పై న సమగ్ర విచారణ చేసి



బాధ్యులను సస్పెండ్ చేసి, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటామని, జిల్లాలో గిరిజన గురుకుల ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, టిఏవిఎస్ నాయకులు సిహెచ్.మహేష్, కె. మారుతి, యు. శివ, సురేష్, హరీష్, లెనిన్ తదితరులు ఉన్నారు.



## మానవత్వం చాటిన ఎస్సై అశోక్ కుమార్

పాలేరు ఫిబ్రవరి 18 ప్రజాపాలన :నేలకొండపల్లి మండలం కోనాయిగూడెం కు చెందిన పసుపులేటి రాజశేఖర్ ఇటీవల విద్యుత్ షాక్ తో మృతి చెందగా వారికి ఏలాంటి అదరువు లేకపోవటంతో మానవత్వంతో స్పందించి నేలకొండపల్లి ఎస్సై జి. అశోక్ కుమార్, వారి కుటుంబ సభ్యులకి 10 వేల రూపాయల ఆర్థికసహాయం అందించారు. పసుపులేటి రాజశేఖర్ వారి కుటుంబానికి ఎటువంటి ఆధారం లేనందువలన కొంతలో కొంత తన వంతు సహాయంగా వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఉద్దేశంతో పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన నేలకొండపల్లి సబ్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్.



## మున్నూరు కాపు కమిటీ సమావేశం

పాలేరు ఫిబ్రవరి 18 ప్రజాపాలన :నేలకొండపల్లి టౌన్ మున్నూరు కాపు కమిటీ సమావేశం తొట శ్రీను పటేల్ అద్యక్షతన మారిశెట్టి వెంకటేశ్వరరావు ఇంటివద్ద జరిగినది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాలేరు నియోజకవర్గ కోఆర్డినేటర్ మారిశెట్టి వెంకటేశ్వరరావు పటేల్ పాల్గొని ప్రసంగించారు. మనం అందరం కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన కోరినాడు. రాష్ట వ్యాప్తంగా మనం 25/ ఉన్నాం. అయిన మన వాటా ప్రకారం రాజకీయ పదవులు దక్కటం లేదు. అందరం కలిసి ఉంటే మనకు రావాల్సిన పదవులు మనకు దక్కుతాయన్నారు. ఈ సమావేశంలో,కందికొండ శ్రీను పటేల్ రేపాల రాములు పటేల్, తోట నరసింహంరావు పటేల్, బాజా నాగేశ్వరరావు పటేల్, కందికొండ సత్యం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయిలో ఆ ఘనత ఎన్టీఆర్‌దే:వెంకయ్యనాయుడు

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగంలో పేర్కొన్న సమాఖ్య వాద భావనను బలోపేతం చేసేందుకు ఆయన చేసిన కృషి, ప్రాంతీయ ఆకాంక్షలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ పాత్ర గురించి ఆయన చెప్పి, ఆచరించిన అంశాలు నేటి కాలానికి కూడా వర్తిస్తాయని అభిప్రాయపడ్డారు. సమాఖ్య స్ఫూర్తి మరియు వివిధ ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఎన్టీఆర్ నిలిచారన్న ఉపరాష్ట్రపతి, దేశంలో ఒకే పార్టీ ఆధిపత్యాన్ని చూసిన దేశప్రజలు, ఎన్టీఆర్ మీద నమ్మకాన్ని ఉంచి, ఓ స్పష్టమైన, చెప్పుకోదగిన ఫలితాన్ని అందించారని తెలిపారు. రాష్ట్రాలు మరియు కేంద్ర ప్రభుత్వాల అధికాల మధ్య సరైన సమతుల్యత విషయంలో ఆయన ఓ స్పష్టతనిచ్చేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యతకు ఎన్టీఆర్ అందించిన సహకారం, ఓ మార్గదర్శక కృషి అని అభిప్రాయపడ్డారు. క్షేత్ర స్థాయిలో, అంత్యోదయ మార్గంలో సాగిన ఎన్టీఆర్ పరిపాలన ఓ నూతన మార్గాన్ని చూపిందన్న ఉపరాష్ట్రపతి, ఆయన మొదటి శాసనసభలోనే తీసుకొచ్చిన ఉప–లోక్ పాల్ చట్టం, సమాజం మరియు రాష్ట్రంలో అవినీతిని అంతం చేసే దిశగా సాగిందని, సుపరిపాలన కోసం వారు చేసిన కృషి ఉన్నతమైనదని తెలిపారు. మహిళలకు ఆస్తి హక్కుతో పాటు రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు ఎన్టీఆర్ చేసిన కృషి ఉన్నతమైనదన్న ఆయన, జిల్లా పరిషత్‌లలో బీసీలకు రిజర్వేషన్లు సహా, 2 రూపాయలకు కిలో బియ్యం లాంటి పథకాలు అట్టడుగు వర్గాల సంక్షేమాన్ని కాంక్షించాయని తెలిపారు. నటుడిగా ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారన్న ఉపరాష్ట్రపతి, మన పురాణ పాత్రలైన రాముడు, కృష్ణుడు, అర్జునుడు, కర్ణుడు, దుర్యోధనుడు, రావణుడు వంటి పాత్రలను ఎన్టీఆర్ పోషించినంత గొప్పగా మరే నటుడు పోషించలేడనే విషయాన్ని అందరూ అంగీకరించారని తెలిపిన ఆయన, మరో భిన్న పార్శ్వంలో ప్రజారంజక పాలన ద్వారా ఆయనలోని ప్రజా నాయకుడు కూడా ఆదర్శమయ్యారని తెలిపారు.

1983లో ఉదయగిరి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికైన విషయాన్ని గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి, ఎన్టీఆర్ నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ సునామీని తట్టుకున్న అతికొద్ది మంది అభ్యర్థుల్లో తానుకూడా ఒకడిననే విషయాన్ని గుర్తు చేసుకున్నారు. మన సంస్కృతిని, సంప్రదాయలను గౌరవిస్తూ జాతిని నవ్యపథంలో నడిపే నాయకుల అవసరం ఉందన్న ఉపరాష్ట్రపతి, తెలుగు భాష అభివృద్ధి కోసం, తెలుగు ప్రజల సంక్షేమం కోసం ఎన్టీఆర్ చేసిన కృషిని ప్రజలు కలకాలం గుర్తు పెట్టుకుంటారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు అంతకు మించిన సామాజిక–రాజకీయ మార్గాన్ని మార్చేయగల మహాపురుషునిగా ఎన్టీఆర్ కనిపించారని పేర్కొన్న ఉపరాష్ట్రపతి, ఎన్టీఆర్ రాజకీయాలు మంచి ఉద్దేశం, మంచి హృదయంతో సాగాయని తెలిపారు. ఆయన రాజకీయాల్లో రావడం వెనుక అధికారం, ఆర్జన మాత్రమే లేవని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగారని తెలిపారు. ఎన్టీఆర్ తో తన సుదీర్ఘమైన, సన్నిహిత అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి తనకు ఎన్టీఆర్‌తో ప్రత్యేకమైన అనుబంధం ఉందని, 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అన్యాయంగా కూలదోయడం, తర్వాత ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ద్వారా ముందు వరుసలో నిలబడి కృషి చేయడం తదితర అంశాలను గుర్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొన్ని అతిపెద్ద తిరుగుబాట్లను నిష్పాక్షికంగా వివరించడంలో, అనుభవంతో కూడిన రచయిత పరిశీలనా శక్తి పుస్తకంలో ప్రతిబింబించిందని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ పుస్తకం ఆ నాటి స్మృతులను గుర్తు చేసిందన్నారు. ఈనాటి యువత ఇలాంటి పుస్తకాల ద్వారా గతాన్ని తెలుసుకుని, ఎన్టీఆర్ లాంటి నాయకుల ఆదర్శంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి మాజీ సలహాదారు సంజయ్ బారు, రచయిత కందుల రమేష్ సహా పలువురు పాత్రికేయులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## న్యాయవాది దంపతుల హ్యతను ఖండించిన చావావేణు



ప్రజా పాలన 18 ఫిబ్రవరి : పెద్దపల్లి జిల్లాలో జరిగినటువంటి హైకోర్టు న్యాయవాద దంపతులు లిగట్టు వామనరావు, నాగమణిలి గార్ల హత్య ఉదంతం తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి భయభ్రాంతులకు గురి చేసింది. లిఇట్టి విషయాన్ని మధిర మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందిలికాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు మాట్లాడుతూఇది ఇది ముమ్మాటికీ ప్రభుత్వ కుట్రపూరిత హత్య ప్రజాస్వామ్యబద్ధంగా చట్టాన్ని పరిరక్షించాల్సిన పోలీస్ అధికారులు, హత్య భావించబడ్డ దంపతుల కు రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశించినా, కోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకుల పైరవీలకు, తాయిలాలకు ఆశపడి ఆదేశాలను పాటించకుండా, ఇంత దుర్మార్గమైన భయంకరమైన సంఘటన జరగడానికి పరోక్షంగా ప్రభుత్వ సహకరించినట్లు గా భావించవలసి వస్తుంది, ఈ సంఘటన యావత్ తెలంగాణ సమాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించే ప్రతి ఒక్కరిని కించపరిచే విధంగా ఉంది, పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే దోషులపై చర్య తీసుకొని శిక్ష విధించాలి ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నుంచి కోరుకుంటున్నాముఈ కార్యక్రమంలో మధిర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవి, మధిర పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జహంగీర్, మధిర పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బిట్ర ఉద్దండయ్యా, మరియు కాంగ్రెస్ నాయకులు ఆవుల కిరణ్, బొమ్మకంటి హరిబాబు, , శీను, ఆదిమూలం శ్రీనివాసరావు మొదలగు వారు పాల్గొన్నారు

## పోడు భూముల పోరుగర్జన సభను విజయవంతం చేయండి:సీపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గుండాల, ఫిబ్రవరి 18, ప్రజాపాలన: సీపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న భద్రాచలం పట్టణం లో జరుగు పోడు భూముల పోరుగర్జన సభను విజయవంతం చేయాలని సీపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. ఈ విషయమై గురువారం మండలంలోని ముత్తాపురం గ్రామంలో జరిగిన మండల స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 30, 40 సంవత్సరాల నుండి ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు, ఇతర పేద ప్రజలు సాగు చ్టేసుకుంటున్న




పోడు భూములను కేసీఆర్ ప్రభుత్వం హరితహారం పేరుతో లాక్కునే ప్రయత్నాలను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని పోడు భూముల్లో కందకాలు తీయడం నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, జడ్పీటీసీ వాగబొయిన రామక్క, గుండాల సర్పంచ్ కొమరం సీతారాములు, పీవైఎల్ రాష్ట్ర నాయకులు పర్శిక రవి, వై వెంకన్న, నరేష్, గడ్డం లాలయ్య, శేఖర్, మంగన్న, పెంటన్న, పూనెటం రంగన్న, భానోత్ లాలు, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాంపాటి పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ ప్రభంజనం

### ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 18 :** స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను తెలియజేశారు. గురువారం జగ్గయ్యపేట పట్ట ణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాల యంలో అయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడు తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి, రెండో విడత పంచా యతీ ఎన్నికల్లో 80 శాతం, మూడో విడత ఎన్నికల్లో 90 శాతం వైఎస్ఆర్ సీపీ అభి మానులు విజయం సాధించ డం ఆనంద దాయకమన్నారు. చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో 89 పంచాయతీ స్థానాలకు 74 పంచాయతీలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్ద తుదారులు విజయం సాధించా రని తెలిపారు. ప్రజల సంక్షే మానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అడ్డు కోవడా నికి ప్రయత్నించిన ప్రతిపక్ష టీడీపీ



కంచుకోటలను ప్రజలు తమ ఓటుతో బద్దలు కొట్టారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును టీడీపీ నేత చంద్రబాబు నాయుడు వక్రీకరిస్తున్నారన్నారు. టీడీపీకే 38 శాతం పంచాయతీలొచ్చాయని చంద్రబాబు మళ్లీ పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. ఆఖరుకు ఎన్నికల ఫలితాల కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెట్టిన వెబ్సైట్కు నకిలీ వెబ్సైట్ సృష్టించారని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానుల గెలుపును తక్కువ చేసి చూపేందుకు దీన్ని వాడుకున్నారని, చంద్రబాబు ఫలితాల వక్రీకరణకు రెండు పత్రికలు, చానళ్లు వంత పాడుతున్నాయని అన్నారు.

## త్వరలో భూముల డిజిటల్ సర్వే:కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఆ భూములు మాత్రమే వారసత్వం ద్వారా, గిఫ్ట్ డీడ్ ద్వారా మరొకరికి సంక్రమించే అవకాశం ఉన్నది.

అక్రమంగా సంపాదించుకునేవారే ఆందోళన చెందుతున్నారు..

ప్రభుత్వం అనుసరిస్తున్న పకడ్బందీ వ్యూహం వల్ల ఎవరూ ధరణిలో వేలుపెట్టి మార్పులు చేసే అవకాశం లేదు. చివరికి సీసీఎల్ఏ, సీఎస్ కూడా రికార్డులను మార్చలేరు. అంతా సిస్టమ్ డ్రివెన్(వ్యవస్థానుగత) పద్ధతిన, హ్యూమన్ ఇంటర్ఫేస్(మానవ ప్రమేయం) లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్నది. రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇంత సజావుగా సాగడం కొందమందికి మింగుడు పడడం లేదు. ధరణి పోర్టల్ మీద చిలువలు, పలువలు ప్రచారం చేస్తున్నారు. అసంబద్ధమైన విషయాలు మాట్లాడుతున్నారు. లేని సమస్యలు సృష్టించి, పైరవీలు చేసి అక్రమంగా సంపాదించుకునే వారు ఇప్పుడు అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వారే అపోహలు సృష్టించి గందరగోళ పరిచే ప్రయత్నాలు చేస్తున్నారు. వాటికి ప్రజలు తికమక పడొద్దు. కొన్ని పత్రికలు కావాలని తప్పుడు వార్తలు, అసంబద్ధమైన కథనాలు ప్రచురిస్తున్నాయి. ఈ వార్తలపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు స్పందించి సంపూర్ణ వివరాలు అందించాలి. సందేహాలను నివృత్తి చేయాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

మిగిలిన కొద్దిపాటి సమస్యలు డిజిటల్ సర్వేతో పరిష్కారం..

ప్రభుత్వం జరిపిన సమగ్ర భూరికార్డుల ప్రక్షాళన, కొత్త పాసుపుస్తకాలు, ధరణి పోర్టల్ తదితర సంస్కరణ వల్ల వ్యవసాయ భూములకు సంబంధించిన చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి. మిగిలిన కొద్ది పాటి సమస్యలు కూడా ప్రభుత్వం త్వరలో జరిపే డిజిటల్ సర్వే వల్ల పరిష్కారం అవుతాయి. తాను అసెంబ్లీలో ఇంతకుముందే ప్రకటించినట్లు త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ సర్వే నిర్వహిస్తాం. ప్రతీ భూమికి కో ఆర్డినేట్స్ ఇస్తాం. వాటిని ఎవరూ మార్చలేరు. గందరగోళానికి, తారుమారు చేయడానికి ఆస్కారం ఉండదు. నిజానికి ఇప్పటికే డిజిటల్ సర్వే ప్రారంభం కావాల్సింది. కరోనా వల్ల ఆగింది. అతి త్వరలోనే డిజిటల్ సర్వే ప్రారంభం అవుతుంది. ఒకసారి సర్వే పూర్తయితే అన్ని విషయాలపై స్పష్టత వస్తుంది. రైతుల భూముల మధ్య, అటవీ- ప్రభుత్వ భూముల మధ్య, అటవీ-ప్రైవేటు భూముల మధ్య హద్దుల పంచాయతీ కూడా పరిష్కారం అవుతుంది. పోడు భూముల సమస్య కూడా పరిష్కారం అవుతుంది. 3-4 నెలల్లో మొత్తం సమస్యలు కొలిక్కి వస్తాయి. కో ఆర్డినేట్స్ మారవు కాబట్టి భవిష్యత్తులో కూడా హద్దుల పంచాయతీకి అవకాశం ఉండదు. భూ రికార్డులు సక్రమంగా ఉన్న దేశాల్లో జీడీపీ 3 నుంచి 4 శాతం వృద్ధి సాధించింది. తెలంగాణ రాష్ట్రంలో కూడా అలాంటి విప్లవాత్మక మార్పుకు ప్రభుత్వం సిద్ధపడిందని సీఎం అన్నారు.

రెవెన్యూశాఖ పేరు మారే అవకాశం.. త్వరలోనే జాబ్ చార్టు

మారిన పరిస్థితుల్లో రెవెన్యూ స్వరూపం కూడా మారింది. రెవెన్యూ శాఖ విధులు, బాధ్యతల్లో మార్పులు వచ్చాయి. గతంలో భూమి శిస్తు వసూలు చేసినప్పుడు రెవెన్యూ అనే పదం, శాఖ వచ్చాయి. ఇప్పుడు రెవెన్యూ వసూలు చేయకపోగా, ప్రభుత్వమే రైతుబంధు ద్వారా ఎకరానికి ఏటా రూ.10 వేల సాయం అందిస్తున్నది. కాబట్టి రెవెన్యూ అనే పేరు కూడా ఇప్పుడు సరిపోదు. పేరు మారే అవకాశం ఉంది. ధరణి పోర్టల్, డిజిటల్ సర్వే తదితర కారణాల వల్ల భూ రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు కూడా సులభంగా, అధికారుల ప్రమేయం లేకుండానే జరిగిపోతాయి. సేద్యం చేసే పంటలు పండించాల్సిన రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే ప్రయాస ఉండదు. ఇదే ధరణి ప్రధాన లక్ష్యం కూడా. కాబట్టి రెవెన్యూ శాఖ విధుల్లో మార్పులు అనివార్యం. రెవెన్యూ శాఖలో ఎవరేమి పని చేయాలనే విషయంలో ప్రభుత్వం త్వరలోనే జాబ్ చార్టు రూపొందిస్తుంది. ఆర్ఐ ఏం చేయాలి? తహసిల్దార్ ఏం చేయాలి? ఆర్డీవో ఏం చేయాలి? అనే విషయాల్లో స్పష్టత ఇస్తాం. రెవెన్యూ అధికారులను పనిచేయగలిగే, పని అవసరం ఉండే చోట ప్రభుత్వం వాడుకుంటుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఏమైనా సమస్యలు, సందేహాలుంటే రైతులు ఇకపై కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టర్లు ఆ దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని పరిష్కరించాలని సీఎం పేర్కొన్నారు.

## 'పరీక్ష పే చర్చ' ఈసారి విభిన్నంగా:మోదీ

(మొదటి పేజీ తరువాయి)

గంభీరమైన అంశంపై సరదా సరదాగా ఈ కార్యక్రమం సాగుతుందని చెప్పారు. "నా విద్యార్థి మిత్రులు, వారి అద్భుతమైన తల్లిదండ్రులు, కఠోరంగా శ్రమించే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని, ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులంతా పాల్గొనవచ్చునని చెప్పారు. "చిరునవ్వుతో, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరవుదాం, రండి" అన్నారు.

ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 19, ఫిబ్రవరి 2021

## ఆదివాసీలను మోసగిస్తున్న కేంద్ర బడ్జెట్..!

కరోనా కాలంలో అత్యధికంగా బాధలు అనుభవించినది ఆదివాసీలే. లాక్‌డౌన్ వలన పనులు పోగొట్టుకున్నవారిలో ఆదివాసీలే గణనీయంగా ఉన్నారు. ఈ కాలంలో ఆదివాసీలు సేకరించిన అటవీ ఉత్పత్తులకు రేట్లు రాలేదు. ఆన్‌లైన్ క్లాసులలో పాల్గొన గలిగే పరిస్థితులు ఆదివాసీ విద్యార్థులకు లేనందున ఈ కాలంలో చదువుకు దూరం కావడమే గాక, తక్కిన విద్యార్థులకన్నా వెనకబడిపోయారు. ఆదివాసీలలో అత్యధికులు కాజువల్, కాంట్రాక్టు కూలీ లుగా పని చేస్తున్నారు. ఈ కాలంలో వారికి కనీస వేతనాలు ఎక్కడా రాలేదు. రైతులుగా ఉన్న ఆదివాసీలకు ఎక్కడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందలేదు. ఈ నేపథ్యంలో ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు ప్రత్యేకంగా అదనపు కేటాయింపులు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కాని మోడీ ప్రభుత్వ బడ్జెట్ ఆదివాసీల పట్ల క్షమించరాని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ప్రభుత్వరంగ సంస్థల వద్ద ఉన్న భూములను అమ్మి సొమ్ము చేసుకోడానికి ఒక ప్రత్యేక ఏర్పాటును ఈ బడ్జెట్ ప్రతిపాదించింది. వాస్తవానికి ఆ భూములలో చాలా భాగం పేదల నుండి, ఆదివాసీల నుండి సేకరిం చినదే. వారి ఆమోదంతో నిమిత్తం లేకుండానే ఆ భూములను భూసేకరణ చట్టం పేరుతో పొందిన నిరంకుశ అధికారాలను అడ్డం పెట్టుకుని గతంలో సేకరించారు. ఇప్పుడు ఆ భూములు ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరం లేకపోతే వాటిని తిరిగి ఆ భూము ల వాస్తవ యజమానులైన ఆదివాసీలకు, పేదలకు అప్పజెప్పాలి. దానికి బదులు వాటిని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుంటోంది. మౌలిక సదుపాయాల, వసతుల కల్పనను ప్రైవేటుపరం చేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అంటే రోడ్లు, హైవేలు వంటివి ప్రైవేటు ఆధిపత్యం కిందకు పోతాయి. వాస్తవానికి ఈ హైవేల నిర్మాణానికి గిరిజన ఉపప్రణాళిక నిధులను అనేక చోట్ల వినియోగించారు. ఇప్పుడు వాటిపై పెత్తనాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పనున్నారు. ఆ కార్పొరేట్లు వాటిపై యూజర్ చార్జీలను వసూలు చేస్తారు. అంటే గిరిజనుల సొమ్ముతో రోడ్లు నిర్మించి, వాటిని వినియోగించినందుకు ఆ గిరిజనుల నుండే తిరిగి చార్జీలు గుంజుతారన్నమాట. ఇందులో రెండు విధాలా ఆదివాసీలనే కొల్లగొడుతున్నారు. ఈ బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలో 43 శాతం, ఉపాధి హామీ పథకంలో 35 శాతం, విద్య లో 6 శాతం కోత పెట్టారు. సామాజికంగా ఇప్పటికే వెనుకబడిన ఆదివాసీలు ఇందువలన ఇంకా వెనకబడతారు. ఈ బడ్జెట్‌లో గిరిజన ఉపప్రణాళిక కింద కేటాయింపులను గత ఏడాదితో పోల్చితే రూ. 26,000 కోట్లు పెంచినట్టు చూపించారు. ఆ కేటాయింపుల వివరాలలోకి పోతే అసలు మోసం అర్థం ఔతుంది. రూ. 9,000 కోట్లు ఆహార మంత్రిత్వ శాఖ పద్దు కింద చూపారు. ఇందులో ఎక్కువ భాగం భారతీయ ఆహార సంస్థకు కేంద్రం బకాయిలను చెల్లించడానికే ఖర్చు చేస్తారు. గిరిజనులకు దక్కేది ఏమీ ఉండదు. నిజంగా గిరిజనులకు మేలు చేయాలనుకుంటే ఈ సొమ్ముతో గిరిజనులందరినీ అంత్యోదయ పథకం కిందకు తెచ్చి వారిని ఆకలి బాధ నుండి కాపాడవచ్చు. కాని మోడీ ప్రభుత్వం తాను చెల్లించవలసిన అప్పు కింద ఈ సొమ్మును ఖర్చు చేయనుంది. మరో రూ. 4,000 కోట్లను హైవేలు, రోడ్లను నిర్మించడానికి కేటాయించారు. కాని ఆ సొమ్మును కూడా గిరిజన ఉప ప్రణాళిక కిందే చూపించారు. ఆ హైవేలతో ఆదివాసీలకు ఒరిగేది ఏముంది? ఇంకో రూ. 3,600 కోట్లు ఎరువుల సబ్సిడీ కింద చూపించారు. అసలు ఇంతవరకూ ఎక్కడైనా గిరిజనులకు ఎరువుల సబ్సిడీ లభించిందా? ఇటువంటి కేటాయింపులు కాగితాలపై ఉండిపోయి చివరకు ఖర్చు కావు. ఎంతెంత కేటాయించావో చూడండి అని చెప్పుకోడానికే తప్ప ఎందుకూ ఉపయోగపడవు. ఇక చాలా గొప్పగా చెప్పిన ఏకలవ్య పాఠశాలల గురించి చూద్దాం. 750 ఏకలవ్య మోడల్ ఆశ్రమ పాఠశాలలను కొత్తగా గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఒక్కో పాఠశాలకూ నిర్మాణానికి అయ్యే ఖర్చును రూ. 20 కోట్ల నుండి రూ. 38 కోట్లకు పెంచారు. కొండిపాంతాల్లోనైతే దీనిని రు. 48 కోట్లకు పెంచారు. ఒక్కో పాఠశాలకు రూ. 38 కోట్ల చొప్పున లెక్క వేసినా ఇందుకు రూ. 22,500 కోట్లు అవసరం. ఐతే బడ్జెట్‌లో అదనంగా కేటాయించినది కేవలం రూ. 100 కోట్లు మాత్రమే (గత ఏడాది రూ. 1313 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ. 1418 కోట్లు కేటాయించారు) ప్రస్తుతం 588 ఏకలవ్య పాఠశాలలు ఉంటే అందులో 303 పని చేయడం లేదు. కేవలం 191 పాఠశాలలకు మాత్రమే భవనాలు పూర్తి అయ్యాయి. నిధుల కొరత ఎంత తీవ్రంగా ఉందో ఈ వాస్తవాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఇప్పుడు నిర్మాణంలో ఉన్నవాటిని పూర్తి చేయడం కూడా చేతకాని ప్రభుత్వం కొత్తగా 750 పాఠశాలలు ఏర్పాటు చేసేస్తామని ప్రకటించడం, అందుకోసం కేవలం రూ. 100 కోట్లు మాత్రం కేటా యించడం అంటే ఎంత బూటకమో ఆలోచించండి! ఇక గిరిజన విద్యకు, వారిలో అక్షరాస్యతను పెంచడానికి గత ఏడాది రూ. 5,841 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ. 5,297 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే రూ. 554 కోట్లు తగ్గించారు. గిరిజన విద్య పట్ల బిజెపి ప్రభుత్వానికి ఎంత చులకనో దీనిని బట్టే తెలుసుకోవచ్చు. గిరిజన వ్యవసాయంలో రూ. 979 కోట్లు కోతబెట్టారు. అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పిస్తామని ప్రకటించినా అందుకోసం రూ. 155 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది ఏ మూలకూ చాలదు. ఆరోగ్య రంగంలో రూ. 337 కోట్లు కోత పెట్టారు. వంటగ్యాస్ సబ్సిడీలో గిరిజనులకు గతేడాది రూ. 1631 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడు కేవలం రూ. 536 కోట్లు మాత్రమే కేటాయించారు. బహుశా గిరిజన మహిళలకు వంట గ్యాస్ ఉపయోగించే హక్కు లేదని బిజెపి ప్రభుత్వం అనుకుంటున్నదేమో! దేశ జనాభాలో 8.6 శాతం గిరిజనులు. కనుక బడ్జెట్‌లో కనీసం 8.6 శాతానికి తగ్గకుండా గిరిజనులకు కేటాయించాలి. ఆ లెక్కన చూస్తే రూ. 2,99,558 కోట్లు కేటాయించాలి. కాని కేవలం రూ. 79,941 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది మొత్తం బడ్జెట్‌లో కేవలం 2.3 శాతం మాత్రమే. ఇందులోనూ పైన తెలిపినట్టు ఉత్తుత్తి కేటాయింపులు కూడా కలిసివున్నాయి. ఆదివాసీలకు ఈ బడ్జెట్‌లో రు. 2 లక్షల కోట్లకు పైగా నష్టం జరిగింది. గతేడాది కేటాయింపుల్లో కేవలం 48 శాతం మాత్రమే ఖర్చు చేసినట్టు గిరిజన మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ చూపిస్తోంది. లాక్‌డౌన్ తో, పేదరికంతో, నిరుద్యోగంతో, ఆకలితో బాధ పడుతున్న గిరిజనులకు చేసిన కేటాయింపులే తక్కువ కాగా వాటిని కూడా ఖర్చు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతులు రాలేదు. 9 నెలల కాలంలో కేవలం 48 శాతం మాత్రమే ఖర్చు చేయగలిగితే, తక్కిన 3 నెలల కాలంలో 52 శాతం ఖర్చు చేయడం సాధ్యమా అన్నది ప్రశ్న. ఇంత ఘోరంగా గిరిజనులకు అన్యాయం చేసిన ఈ కేంద్ర బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా ఉన్న గిరిజనమంతా తమ నిరసనను తెలియజేయాలి. ఉద్యమాలు నడిపి న్యాయంగా రావలసిన వాటాను రాబట్టాలి.

# అన్నదాతలు 'పరాన్నజీవులు' కాదు



రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ, ప్రధాని మోడీ, తన ప్రభుత్వాన్ని తాను పొగుడుకోవడానికే గంటన్నర సమయాన్ని వెచ్చించారు. కరోనా మహమ్మారిని భారతదేశం చాలా బాగా అదుపు చేసిందని ప్రపంచమంతా ప్రశంసిస్తున్నదని చెప్పారు. కానీ అకస్మాత్తుగా లాక్‌డౌన్ విధించినందువల్ల ప్రజలు పడిన ఇబ్బందుల గురించి కాని, విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థ గురించిగాని చిన్నపిల్లల్లో, తల్లుల్లో పెరిగిన పోషకాహార లోపాన్ని గురించి గాని, వలస కార్మికుల పాట్లు గురించిగాని ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. కోవిడ్ కేసుల సంఖ్యలో, మరణాల సంఖ్యలో భారత్ రెండవ స్థానంలో వుందన్న సంగతి కూడా ప్రస్తావించలేదు.

రైతుల నిరసనలు – ఆందోళన జీవులు

రైతులు చేస్తున్న పోరాటం గురించి మాట్లాడుతూ...గత ఆరేళ్ల కాలంలో తమ ప్రభుత్వం భారతదేశ వ్యవసాయానికి, రైతులకు లాభాలు చేకూర్చిందని మోడీ అన్నారు. ఈ పోరాటంలో 200 మంది రైతులు తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోయినందుకు ఎటువంటి విచారాన్నీ వ్యక్తం చేయలేదు. పైగా, ఆయన ఈ చారిత్రక పోరాటంలో పాల్గొన్న రైతులకు వ్యతిరేకంగా వారిని 'ఆందోళన జీవులని' పరోక్ష నిందలు వేసి, నిరసనకారులను 'పరజీవులుగా', 'పరాన్నజీవులుగా' వర్గీకరించారు. సుదీర్ఘకాలం పాటు ఈ ఆందోళన జీవులు స్వాతంత్ర్య పోరాటం నడిపిన తర్వాతనే భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందింది. ఈ పోరాటం వల్లనే 'ప్రజలమైన, మనం' లౌకిక, ప్రజాస్వామిక రిపబ్లిక్, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఇస్తున్న మన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాం. దీని కారణంగానే నేడు మోడీ భారతదేశానికి ప్రధానమంత్రిగా ఉన్నారు. ఈ స్వాతంత్ర్య పోరాటంలో లక్షల సంఖ్యలో ప్రజలు అమరులయ్యారు. కానీ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ల నుంచి దేశ స్వాతంత్ర్యం కోసం గానీ, ఆధునిక భారతదేశం అభివృద్ధి కోసం గానీ ఏ ఒక్కరూ త్యాగాలు చేసిన వారు లేరు. ఆర్‌ఎస్‌ఎస్ జాతీయోద్యమానికి దూరంగా ఉండి, కొన్ని సమయాలలో బ్రిటిష్ వారికి సహాయ పడిన వాస్తవం అందరికీ తెలిసిందే. బిజెపి ప్రారంభించిన నిరసనోద్యమాల నుండి మొదలుపెట్టి భారతదేశ ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన వ్యక్తి, నిరసనకారులపై 'ఆందోళన జీవులుగా' అనుచిత వ్యాఖ్యలు చేయడం వెనక ఒక పథకం వుంది. ఇది ప్రజలను పూర్తిగా రాజకీయ రహితం చేసే ప్రయత్నం చేయడమే. ఎటువంటి నిరసనలనూ, భిన్నాభిప్రాయాలనూ సహించని ఫాసిస్టు హిందూత్వ స్థాపన లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ ముందుకు తెస్తున్న ఎజెండా ఇది. నిరసనలు రెండు విధాలు. మొదటిది మరింత మెరుగైన జీవితాల కోసం, జీవనోపాధి కోసం, దేశాభివృద్ధి కోసం జరిగేవి. ఇవి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా వుంటాయి. రెండవది, ప్రజలను విభజించి, ద్వేషాన్ని, హింసను వ్యాప్తి చేసి సమాజాన్ని అస్థిరపరిచే లక్ష్యంతో సమస్యలు సృష్టించే నిరసనలు. ఉదాహరణకు 1990వ దశకంలో బిజెపి రథయాత్ర సృష్టించిన రక్తపాతం. మత ఘర్షణలలో వేల సంఖ్యలో అమాయక ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. ఇలాంటి 'ఆందోళన జీవుల' పట్ల దేశం, ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దేశం మొత్తం మీద వివిధ తరగతుల ప్రజలు తమ హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. ప్రజలను విభజించడం, పాశవిక చట్టాల కింద మానవ హక్కుల కార్యకర్తలు, పౌరహక్కుల కార్యకర్తలపై నేరాలు మోపి, జైలులో నిర్బంధించడం ద్వారా ఈ బిజెపి ప్రభుత్వం ఈ పోరాటాలను అణచివేయాలని చూస్తోంది.

విదేశీ విధ్వంసకర భావజాలం

మన రాజ్యాంగ క్రమాన్ని సంరక్షించుకొనేందుకు చేస్తున్న ప్రజా ఉద్యమాల వెనుక 'విదేశీ హస్తం' ఉందని భారతదేశ పాలక వర్గాలు నిందిస్తున్నాయి. ప్రధాని మోడీ ఈ చారిత్రక పోరాటాలను ముఖ్యంగా రైతుల పోరాటాన్ని విదేశీ విధ్వంసకర భావజాలం నుంచి ఉద్భవించిన పోరాటంగా చెపుతున్నారు. మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, వ్యవస్థలు, వాటి స్వంత హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న ప్రజలలో 'విదేశీయత' ఏదీ లేదు. ప్రధానమంత్రి మాట్లాడుతున్నది బహుశా, ఈ ప్రభుత్వం రైతుల పోరాటాన్ని అణచివేస్తున్న తీరును వ్యతిరేకిస్తూ అంతర్జాతీయంగా వ్యక్తమవుతున్న బహిరంగ నిరసన గురించి కావచ్చు. అన్నదాతలైన, మన రైతులకు జరిగిన అవమానం కంటే పెద్ద అవమానం ఇంకేదీ లేదు. వారు పండిస్తున్న ధాన్యం వల్లే, ప్రధాన మంత్రితో సహా మనందరం బతుకుతున్నాం. కానీ ఈ అన్నదాతలకు మన ప్రధాని 'ఆందోళన జీవులు', 'పరాన్నజీవులు' అని పేరు పెట్టాడు. మన 'అన్నదాతలు' పండించే ధాన్యాలను తింటూ వారినే నిందిస్తున్నవారు 'పరాన్నజీవులు'.

డొల్ల వాదనలు

గడిచిన ఆరేళ్ల కాలంలో తన నాయకత్వంలో, గతంలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాలు సాధిస్తున్నారని మోడీ చెప్పారు. చరణ్‌సింగ్ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ, చరణ్‌సింగ్ అంచనా ప్రకారం 51 శాతంగా వున్న సన్న, చిన్నకారు రైతుల జీవితాలను మెరుగు పరిచేందుకు తన ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని ప్రధానమంత్రి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మోడీ ఉపాధి హామీ పథకాన్ని, ఎగతాళి చేశారు. గడిచిన ఆరేళ్ల కాలంలో ఆయన ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో కుదిస్తోంది. ఆరేళ్లలో రైతుల ఆత్మహత్యలు ఏ మాత్రం తగ్గకుండా కొనసాగాయి. హరిత విప్లవం ద్వారా సంపన్న రాష్ట్రంగా మారిన పంజాబ్ రాష్ట్రంలో కూడా ఒక రైతు కుటుంబం సగటు నెలసరి ఆదాయం రూ. 18,059 వుంటే, అదే హర్యానా రాష్ట్రంలో రూ. 14,434 ఉంది. ఈ మూడు వ్యవసాయ చట్టాలనూ రద్దు చేయాలని మొత్తం రైతాంగం కోరుతోంది.

వ్యవసాయ సంస్కరణలు

ప్రతిపక్ష పార్టీల వారు కోరిన వ్యవసాయ సంస్కరణలనే తన ప్రభుత్వం తెచ్చిందని, కాని వారిప్పుడు వ్యతిరేకిస్తున్నారని ప్రధాని ప్రతిపక్ష పార్టీల వారిపై ఆరోపణలు చేస్తున్నారు. అవును, చాలా పార్టీలు వ్యవసాయ సంస్కరణలను కోరాయి, కానీ ఎలాంటి సంస్కరణలు? భారతదేశ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే, దేశంలో ఆహార భద్రతకు హామీ ఇచ్చే, దేశ ప్రజలకు సరసమైన ధరలకు ఆహారాన్ని అందించే, రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించే సంస్కరణలు కావాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేసింది. కానీ అందుకు భిన్నంగా, ప్రస్తుత వ్యవసాయ చట్టాలు భారతదేశ వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేసే విధంగా, దేశీయ, విదేశీ కార్పొరేట్ల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడే విధంగా, ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే విధంగా ఉన్నాయి. అందుకే సిపిఐ(ఎం) పార్లమెంట్ లోపల, వెలుపల కూడా ఈ వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తున్నది.

కనీస మద్దతు ధర

'మద్దతు ధర ప్రస్తుతం ఉంది, గతంలో ఉంది, భవిష్యత్తులో కూడా ఉంటుందని' ప్రధానమంత్రి అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను మొట్టమొదట అమలు చేసేది తన ప్రభుత్వమేనని ఆయన అన్నాడు. స్వామినాథన్ కమిషన్ సీ2కు తోడు మరో 50 శాతం మద్దతు ధరను సిఫార్సు చేసింది. ఈ ప్రభుత్వం ఇస్తున్నది ఏ2కు అదనంగా 50 శాతం. ఈ రెండింటి మధ్య ఉండేదే ప్రధానమైన తేడా. ఏ2లో వాస్తవ ఖర్చు మాత్రమే ఉంటుంది. సీ2లో వాస్తవ ఖర్చుతోపాటు భూమి కౌలు విలువ, స్థిరపెట్టుబడి విలువలపై వడ్డీ అదనంగా ఉంటుంది. అందు వలన కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ చేసిన ఇతర సూచనలతో పాటు కనీస మద్దతు ధరపై చేసిన సిఫార్సులను తుంగలో తొక్కింది. 2019 సాధారణ ఎన్నికల్లో సిపిఐ(ఎం) ఎన్నికల మ్యానిఫెస్టోలో 'వ్యవసాయ సంస్కరణలపై', రైతులందరికీ తమ ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు అమ్ముకునేందుకు చట్టబద్ధమైన హక్కును ఇవ్వాలని మొదటి డిమాండ్‌గా పెట్టింది. 2017 నుంచి సిపిఐ(ఎం) పార్లమెంట్ సభ్యులు ఈ డిమాండ్‌ను లేవనెత్తుతున్నారు, కానీ నేటికీ కేంద్ర ప్రభుత్వం అటువంటి చట్టాన్ని తీసుకొనిరాలేదు. తరువాత, కనీస మద్దతు ధర అన్ని వ్యవసాయ పంటలకు రైతులందరికీ వర్తింపజేయాలి. కానీ ప్రస్తుతం కనీస మద్దతు ధర కేవలం ఆరు పంటలకే వర్తిస్తుంది. సమర్థవంతమైన సేకరణ యంత్రాంగం లేకుండా కనీస మద్దతు ధర అనేది అర్థం లేని విషయం. కాబట్టి, ప్రభుత్వ, ప్రయివేట్ సేకరణ వ్యవస్థను దేశ వ్యాప్తంగా విస్తృతం చేయాలి.

తప్పుడు వాదనలు

తన అలవాటు ప్రకారం, ప్రధానమంత్రి కొన్ని తప్పుడు వాదనలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 'భారత్ పెద్ద ప్రజాస్వామ్య దేశం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికే తల్లి' అని నేతాజీ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నట్టు ప్రధాని అన్నారు. కాని, భారతదేశం యొక్క ఆధునిక లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థ గురించి నేతాజీ ఎటువంటి ప్రకటనా చేయలేదు. అదేవిధంగా 1966లో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో హరిత విప్లవం తెస్తే లాల్‌బహదూర్ శాస్త్రి తీసుకొని వచ్చినట్టు మోడీ అన్నారు. అటువంటి అవాస్తవ ప్రకటనలతో మోడీ తప్పించుకోలేరు.

వ్యవసాయ చట్టాలను వ్యతిరేకించే వారు, భారతదేశ వ్యవసాయ రంగం, మన రైతుల (అన్నదాతల) శ్రేయస్సును సమర్థిస్తున్నారు. వ్యవసాయ చట్టాలను ప్రచారం చేస్తూ, సమర్థిస్తున్న వారంతా...కార్పొరేట్ కంపెనీల లాభాలు గరిష్టంగా పెంచేందుకు...భారతదేశ వ్యవసాయ రంగాన్ని, మన ఉత్పత్తులను, మన మార్కెట్లను లూటీ చేయడానికి మార్గాలను సులభతరం చేస్తున్నారు.

ఈ కార్పొరేట్లు ఎవరనే విషయాన్ని కూడా మన అన్నదాతలు నిస్సందేహంగా గుర్తించారు. కాబట్టి, ఈ చారిత్రక నిరసనలు భారతదేశ వ్యవసాయ రంగాన్ని, భారత ప్రజానీకాన్ని, భారతదేశ ఆహార భద్రతలను కాపాడేందుకే అన్న విషయం స్పష్టమవుతుంది. ఈ మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి. ఆ తరువాత ప్రభుత్వం వ్యవసాయ సంస్కరణలను మన రైతులతో, వారి కార్పొరేట్ కంపెనీలతో, ఇతర భాగస్వాములతో చర్చించాలి. ఏవైనా తాజా ప్రతిపాదనలు ఉంటే, పరిశీలన, ఆలోచనల కోసం పార్లమెంట్ ముందుకు తీసుకుపోయి అప్పుడు చట్టాలను చేయాలి. ఇది చాలా సహేతుకమైన ప్రతిపాదన. ప్రధానమంత్రి తన మొండి పట్టుదలను వదిలి ఈ చట్టాలను రద్దు చేయాలి.

# మాజీ మంత్రి జలగం విస్తృత పర్యటన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల:(ప్రజా పాలన) ఫిబ్రవరి 18: మాజీ మంత్రి జలగం ప్రసాద రావు గురువారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. గత కొంత కాలంగా మండలంలోని గిరిజనుల సాగుభూములకు విద్యుత్ సౌకర్యం తో పాటు విద్యుత్ మోటర్లను జేవీర్ ట్రస్ట్ ఏర్పాటుచేస్తుంది. ఈ క్రమంలో ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రజల నుంచి వినతులు శ్వీకరించారు. పాత గంగారం, నర్సాపురం, తోగూడెం గ్రామాల్లో రైతులతో పాటు సాగుభూములను పరిశీలించి వాటికి ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటి గురించి అధికారులతో చర్చించారు. ఈ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు జలగం వెంగళరావు ట్రస్ట్ ద్వారా సబ్ మోర్సైబుల్ మోటార్లు సగం ధరకే ఇవ్వనున్నామని తెలిపారు. పాత గంగారం నుంచి కోటమ్మ గుడి మీదుగా వెళ్లే రహదారిని ఈజీఎస్ నిధులతో నిర్మాణం చేయొచ్చని రైతులకు తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ తులసీ, గంగారం సర్పంచ్ వాడే లక్ష్మీ, తాంద్ర రాంబాబు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పూర్ణ చందరావు, పామర్తి నాగేశ్వరరావు, రత్న భూషణం తదితరులు పాల్గొన్నారు.

# మద్గుల్ చిట్టంపల్లిలో గులాబి భరోసా

## వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి 18 ( ప్రజాపాలన ) : పార్టీ ప్రతిష్ఠతకు కార్యకర్తలే పునాది రాళ్ళని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 8, 7, 31వ వార్డులకు చెందిన మద్గుల్ చిట్టంపల్లి, శివరాంనగర్ లలో వార్డు మెంబర్లు కుమ్మర్పల్లి గోపాల్ ముదిరాజ్, పరిగి సంతోష నర్సిములు, పట్టణ కోశాధికారి మాలె లక్ష్మణ్ ఆధ్వర్యంలో శివారెడ్డిపేట్ పిఏసిఎస్ వైస్ చైర్మన్ గడ్డమీది పాండు ముదిరాజ్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్ళపల్లి రమేష్, కౌన్సిలర్లు చిట్యాల అనంత్ రెడ్డి, మల్లేపల్లి నవీన్ కుమార్ ల సమక్షంలో గులాబి భరోసా లో భాగంగా పార్టీ సభ్యత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..50 వేల పార్టీ సభ్యత్వ లక్ష్యాన్ని పూర్తి చేయుటకు మనమందరం అవిశ్రాంత కృషి చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిర్దేశ లక్ష్యం కంటే ఎక్కువ సభ్యత్వం చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. సాధారణ కార్యకర్త 30 రూపాయలు, క్రియాశీలక కార్యకర్త 100 రూపాయలు చెల్లించి సభ్యత్వాన్ని తీసుకోవాలని సూచించారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రెండు లక్షల బీమా సౌకర్యం లభిస్తుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ రాజమల్లయ్య, నాయకులు నర్సింలు, కడియాల వేణు గోపాల్ ముదిరాజ్, గిరీష్ కొఠారి, కిషోర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# తెరాస సభ్యత్వా నమోదు ప్రారంభించిన ఎంపీపీ నక్కశంకర్



గొల్లపల్లి, ఫిబ్రవరి18(ప్రజాపాలన):గొల్లపల్లి మండలంలోని ?చిల్వకొడూర్ గ్రామం లో ఎంపీపీ నక్క శంకర్, ఆధ్వర్యం టీఆరెస్ ప్రార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలోపాల్గొన్న వారు చెందొలి ప్యాక్స్ చైర్మన్ గందే వెంకట మాధవ రావు,తెరాస మండల అధ్యక్షులు బోల్లం రమేష్,ఎంపీటీసీ మహబుబ్,సర్పంచ్ పద్మ రవీందర్, ఉపసర్పంచ్ నక్క ఏసయ్య,మండల మైనారిటీ అధ్యక్షుడు అంజద్,టీఆరెస్ గ్రామశాఖ అధ్యక్షుడు లక్ష్మిరాజం, పార్టీముఖ్య నాయకులు కనకయ్య, పరంధాములు,శ్రీను, , మొండయ్య,లచ్చయ్య కునా రాజేందర్,కునా రాజేష్,తాంద్ర స్వామి,గంధం మధుకర్, రంగ వెంకట సాయి ,బ్రహ్మయ్య ,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

## జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్త

వికారాబాద్ జిల్లా ప్రతినిధి 18 ( ప్రజాపాలన ) : సిఎం కేసిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అనంతగిరి దేవాలయం ప్రాంగణం లో అన్నదానం నిర్వహించామని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్త గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర విధాత, అపరభగీరథుడు, బంగారు తెలంగాణ నిర్మాణ ప్రదాత, నిరంతరం ప్రజాశ్రేయస్సుకై పరితపించే సిఎం కేసిఆర్ ఇలాంటి జన్మదినాలను మరెన్నో జరుపుకో వాలని ఆకాంక్షించారు. జిల్లా రైస్ మిల్లెర్స్ అసోసియేషన్ తరపున శ్రీ అనంతపాదనాభ స్వామి ఆలయం లో ప్రత్యేక పూజా కైంకర్యాలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు మిల్లర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



# రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి



మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన :మునిసిపల్ చైర్ పర్సన్ మొండితోక లతలిమార్చి14న జరిగే %మీాజ% ఎన్నికలను పురస్కరించుకుని అంబేద్కర్ సెంటర్లలో ఓటు విలువ పై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులుచే అవగాహన కార్యక్రమం జరిగిందిఈ కార్యక్రమంలో 13 వార్డ్ కౌన్సిలర్ బిక్కిఅనిత,వినాయక గుడి చైర్మన్ మిరియాల సీతారాములు, కో అప్షన్ నంబర్ ఖసేమ్,కళాకారులు అర్జునరావు,పమ్మి రవిబాబు, %ఎష్ట్ర% కోటేశ్వరరావు,, జి.సునీత,,యం. ముత్తయ్య తో పాటు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లు భట్టి విక్రమార్క రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



పాలేరు ఫిబ్రవరి 18 ప్రజాపాలన:ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లి లో శనివారం మధ్యాహ్నం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్న రాష్ట్ర సీఎల్పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలో రైతుల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు పైనంపల్లి లో ఈనెల 20వ తారీఖున రైతులతో ముఖాముఖి. కార్యక్రమం చేపట్టనున్నారు. ఈరోజు నేలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో. విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్, మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తక్షణం ఉపసంహరించుకోవాలని. రైతు ఎన్నో కష్టాలు పడి పంట పండిస్తే. దళారుల చేతిలో రైతు. మోసపోవాల్సివస్తుందని. రైతులను ఆదుకునే విధంగా నేరుగా ఐకెపి. సెంటర్ల ద్వారా ప్రభుత్వం మే. కొనుగోలు చేయాలని ఆయన కోరారు.రాష్ట్ర జడ్పిటిసి. ల సంఘం అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, మాట్లాడుతూ. సీఎల్పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, నేలకొండపల్లి సర్పంచ్ రాయపూడి నవీన్, ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, జక్రిపోతుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మామిడి వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, జెక్రిపోతుల అంజని, ఆరేకట్ల గురవయ్య,కుక్కల ఆదాం, భూక్యా చిన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎఫ్ టి యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి:ఐఎఫ్టియు నేత సంజీవ్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజాపాలన: జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 21న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షులు %చీ%.సంజీవ్ తెలిపారు.ఈరోజు స్థానిక ఐ.ఎఫ్.టి.యు కార్యాలయంలో అయ్యుయెూ కొత్తగూడెం ఏరియా కమిటీ సమావేశం పి సతీష్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశాన్ని ఉద్దేశించి సంజీవ్ మాట్లాడుతూ జిల్లాలో అయ్యప్ప యు అభివృద్ధి చేయడం కోసం అలాగే కార్యకర్తలు యొక్క అవగాహన పెంపుదల కోసం దేశంలో రాష్ట్రంలో కార్మిక వర్గానికి జరుగుతున్న అన్యాయాల విషయాలపై తదితర అంశాలను ఈ క్లాసులో బోధించడానికి ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం గారు మరియు రాష్ట్ర సహాయ కార్యదర్శి జి రామయ్య గారు టీచర్ గా వస్తున్నారు ఈ యొక్క రాజకీయ శిక్షణా తరగతులకు జిల్లా నలుమూలల నుండి ఐ.ఎఫ్.టి.యు ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు ఈ యొక్క శిక్షణ తరగతులు లో కార్మిక చట్టాల సవరణ ఐఎఫ్టియు నిర్మాణం పని విధానం ప్రస్తుతం కార్మికోద్యమ ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలను క్లాసులు గా బోధించగలరు కావున ఈ యొక్క క్లాసులను జిల్లాలో ఉన్నటువంటి ప్రతినిధులు పాల్గొని ఈ యొక్క క్లాసులను విజయవంతం చేయాలని కోరుచున్నాం యొక్క సమావేశంలో ఏరియా కమిటీ అధ్యక్షులు శ్రీ సతీష్ పుష్ప రాజు నరసింహ రామకృష్ణ చంద్రయ్య రాధక్క నాగలక్ష్మి మరియమ్మ సంధ్య లలిత విజయ్ తదితరులు పాల్గొన్నారు

# రైతు వేదికలను ప్రారంభించిన మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల, ఫిబ్రవరి 18 (ప్రజాపాలన:జగిత్యాల అర్బన్ మండల్ అంబారిపెట్ కల్లెడ పొలాస రైతు వేదికలను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం మోతే గ్రామానికి చెందిన రైతు కనుక లక్ష్మణ్ ఇటీవల మరణించగా లక్ష్మణ్ భార్య కనుక రాజేశ్వరికి 5 లక్షల చెక్కును మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రవి రూరల్ ఎంపీపీ గజర్ల గంగారాం గౌడ్ అర్బన్ ఎంపీపీ మెదరి అనిత జడ్పీటీసీ సంగెపు మహేష్ ఏఎంసి చైర్మన్ దామోదర్ రావు ప్యాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి రైతుబంధు కో ఆర్డినేటర్ జుంబర్తి శంకర్ సర్పంచ్ గంగాధర్ ఎంపీటీసీ మల్లారెడ్డి రైతు బంధు సమితి నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లం శ్రీనివాస్ కి నేలకొండపల్లి లో ఘన సన్మానం



పాలేరు ఫిబ్రవరి 18 ప్రజాపాలన : ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నేలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర జడ్పిటిసి. ల సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన శుభ సందర్భంగా బెల్లం శ్రీనివాస్, గారిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నేలకొండపల్లి సర్పంచ్ రాయపూడి నవీన్, శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.రాయపూడి నవీన్. మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీతో సహా ఎంతో మది జడ్పీటీసీలు ఉండగా కాంగ్రెస్ పార్టీ చెందిన బెల్లం శ్రీనివాస్ గారిని రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల చాలా సంతోషంగా ఉందని. ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ. బొడ్డు బొందయ్య, జక్రిపోతుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మామిడి వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, జెక్రిపోతుల అంజని, ఆరేకట్ల గురవయ్య, కుక్కల ఆదాం, భూక్యా చిన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు బార్ షాపులకు 147 దరఖాస్తులు

**తాండూర్ 2 బార్ షాపులకు 67, పరిగి ఒక బార్ షాపుకు 80 మంది దరఖాస్తు గురువారం నాటి లక్కీ డ్రాలో తాండూరుకు దుబ్బ సతీష్, కల్వ ఉమాశంకర్ లు పరిగికి బర్కత్ పల్లి రాంరెడ్డిలు విజేతలు:జిల్లా పాలనాధికారిణి పౌసుమి బసు**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి 18 ( ప్రజాపాలన ) : జిల్లాలో 25 జనవరి నుండి 16 ఫిబ్రవరి 2021 వరకు కొత్త బార్ల కేటాయింపు కొరకు దరఖాస్తుల ఆహ్వానాన్ని ఆబ్కారి శాఖ ద్వారా కోరామని జిల్లా పాలాధికారిణి పౌసుమి బసు అన్నారు. తాండూర్ లో 2 బార్ షాపులకు 67, పరిగిలో ఒక బార్ షాప్ కు 80 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆబ్కారి శాఖ ఆధ్వర్యంలో బార్ల కేటాయింపు కొరకు లక్కీ డ్రా అభ్యర్థుల సమక్షంలో నిర్వహించడం జరిగింది. తాండూర్ కు చెందిన దుబ్బ సతీష్ కుమార్, కల్వ ఉమాశంకర్ లు దక్కించుకొగా, పరిగికి చెందిన బర్కత్పల్లి రామ్ రెడ్డి లు లక్కీ డ్రాలో బార్ షాపులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా మద్య నిషేధ, ఆబ్కారి శాఖ జిల్లా అధికారి వరప్రసాద్ తో పాటు వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహిళాల రక్షణకు పేపర్స్ స్ప్రే దోహదం:ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి

మేడిపల్లి, ఫిబ్రవరి18 (ప్రజాపాలన) :దొంగలు, పోకిరిల నుండి తనను తాను రక్షించుకోవడానికి మహిళలకు, విద్యార్థినులకు పేపర్స్ స్ప్రే ఎంతగానో ఉపయోగపడుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. హబ్సిగూడ మెయిన్ రోడ్ లోని హరిప్రియ కాంప్లెక్స్ రెండవ అంతస్తులో "కాంబాట్ పేపర్స్ స్ప్రే" నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంబాట్ పేపర్స్ స్ప్రే ప్రొప్రైటర్ సత్యనారాయణ, అలీమ్ మాట్లాడుతూ ఒంటరి మహిళలకు, విద్యార్థినులకు, అవ్వుట్ కట్స్ లో నివాసం ఉంటున్న వృద్ధులు తమను తాను రక్షించుకోవడానికి ఈ పేపర్స్ స్ప్రే చాల్లా ఉపయోగపడుతుందని వారు తెలిపారు. వచ్చే మహిళా దినోత్సవం రోజున ఈ పేపర్స్ స్ప్రేను మార్కెట్ లోనికి అందరికీ అందుబాటులో ఉండే ధరను నిర్ణయించి విడుదల చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రం శ్రీనివాస్, స్థానిక టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి అభ్యర్థిని గెలిపించాలి

మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన : బీజేపీ మధిర పట్టణ మరియు రురల్ మండల అధ్యక్షులు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి ఆద్యర్యములో, బీజేపీ అభ్యర్థి శ్రీ గుజ్జుల ప్రేమేంద్రరెడ్డి గారి, విజయాన్ని కాంక్షిస్తూ మధిరలో ప్రభుత్య కార్యాలయాలలో ప్రచారము చేయటము జరిగింది, ఈకార్యక్రమములో బీజేపీ జిల్లా ఉపధ్యక్షుడు, వేణు గోపాల్ రెడ్డి గారు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలువేరు సాంబశివరావు గారు,బీజేపీ జిల్లా కార్యదర్శి, మార్పకట్ల స్వర్ణకార్ గారు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి. పెరుమాళ్లపల్లి విజయరాజు గారు, మరియు,బీజేవైఎం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, రామిశెట్టి నాగేశ్వరావు గారు, బీజేపీ,రాష్ట్ర మరియు జిల్లా నాయకులు, పాల్గొనటం జరిగింది, ఈసందర్భముగా నాయకులు మాట్లాడుతు, అధికార తెరాస పార్టీకి ఈ ఎన్నికలో ఓట్లు అడిగే హాకు కోల్పోయారు అనీ, నిరుద్యోగులకు. ఉద్యోగాలు కల్పించుటలో, ప్రవేట్ టీచర్స్ ను ఆదుకోవటంలో పూర్తిగా ఇఫలం చెందిన ఈ రాష్ట్ర ప్రభుత్యము, అలాగే ప్రభుత్య ఉద్యోగులకు, %ూ=జ% విషయములో తప్పుదారి పట్టిసత్తూ వాళ్ళను అభద్రతా భావానికి గురిచేస్తున్న, ఈ రాష్ట్ర ప్రభుత్వనికి, %ఎశ్రీఓ%





ఎన్నికలో, విద్యార్థులు, నిరుద్యగులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, అందరు కలసి ఈ ప్రభుత్వనికి బుద్ది వచ్చేలాగా, బీజేపీ అభ్యర్థి,లి గుజ్జుల ప్రేమేంద్ర రెడ్డిలి గార్కి మీ మొదటి ప్రాధాన్యత ఓటు, వేసి గెలిపించాలని కోరటం జరిగింది, ఈ కార్యక్రమములో, బీజేపీ పట్టణ మరియు రురల్ మండల అధ్యక్షులు, పాపట్ల రమేష్, గుండా చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, కుంచం కృష్ణారావు, %ౕ%,రావూ యోగేశ్వరావు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి, %ఎ% నాగభూషణం, నరసింహారావు,కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు %దీ% నాగభూషణరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు, రామకృష్ణ, నాగేంద్రబాబు,ఉపాధ్యక్షుడు సాయిరామ్, ఖాజామియా, సుమంత్, సాయి, %ఖ% ప్రకాశరావు,,శ్యామ్, తదితరులు పాల్గున్నారు.

# న్యాయవాది దంపతులను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి



మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన :న్యాయవాది వామనరావు దంపతుల హాత్యలను తీవ్రంగా ఖండించిన మధిర బార్ అసోసియేషన్..వామనరావు దంపతులనుహత్య చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని, హంతకులు ఎంతటివారైనా శిక్షించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

## గర్భిణీకి నిత్యవసరాలు పంపిణీ

మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన :మధిరలో.. గర్భిణీ స్త్రీ భర్త కాలుకు దెబ్బ తగిలి పనికి వెళ్లలేని పరిస్థితిలో ఉండగా.. తినటానికి లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఈ కుటుంబానికి మధిర రెస్క్యూ టీం రెండు నెలలకు సరిపడా బియ్యం నిత్యవసర సరుకులు. దుప్పట్లు అందజేయడం జరిగింది.. అలాగే మరొక మహిళ ( భర్త చనిపోయాడు).అనారోగ్యంతో బాధపడుతుం డగా ఆ కుటుంబానికి బియ్యం నిత్యావసర సరుకులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో మధిర రెస్క్యూ టీం దోర్నాల రామకృష్ణ నిస్సి హరిణి పాల్గొన్నారు.



# పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి

**సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మహేందర్**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి 18 ( ప్రజాపాలన ): పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై మహేందర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని మరిచి కార్పోరేట్ శక్తులకు సేవలు చేస్తోందని విమర్శించారు. కరోనా కాలంలో పేద ప్రజలు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతుంటే ఉపాధి కల్పించకుండా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుచారని దెప్పి పొడిచారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను అన్నింటిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంలో బిజెపి ప్రభుత్వం ముందంజలో నడుస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టుకుంటూ కార్పోరేట్ ఊడిగం చేయడం సమంజసం కాదని చెప్పారు.



సామాన్యుని నిత్యావసరాల ధరలు అదేవిధంగా పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వై. గీత , గోపాల్ , శ్రీశైలం మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభావతి, పద్మమ్మ, మహేందర్ , ప్రేమలమ్మ పాల్గొన్నారు.

## శ్రీ షిరిడి సాయి దేవాలయంలో ఆళ్లకృష్ణ,కృష్ణ వేణి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు





మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన :ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని శ్రీ షిరిడి సాయి దేవాలయంలో మధిర పట్టణానికి చెందిన ఆళ్లకృష్ణ,కృష్ణ వేణి దంపతుల మనవడు,మనవరాలు అచ్యుత్ సాయి,వేదవర్షిణీల పేరు మీద గురువారం నాడు మధిర పట్టణంలోని అభాగ్యులకు ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని శ్రీ షిరిడి సాయి దేవాలయంలో మధిర పట్టణానికి చెందిన ఆళ్లకృష్ణ,కృష్ణ వేణిల దాతల సహకారంతో మధిర పట్టణంలోని అభాగ్యులకు మరియు అనాధలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. %ంతీ%ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్న దృక్పథంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో న్యాయవాదుల హత్యను తీవ్రంగా ఖండించిన బీజేపీ ఎస్టీ మోర్చా నాయకుడు దేవావత్ భరత్ సింగ్



ఆమీర్ పేట్(ప్రజాపాలన) :మంథని మండలం గుంజపడుగుకు చెందిన హైకోర్టు న్యాయవాదులైన భార్యాభర్తలు గట్టు వామనరావు,నాగమణి లను అత్యంత క్రూరంగా,పాశవికంగా రోడ్డు పైనే హత్యచేయడాన్ని బీజేపీ ఎస్టీ మోర్చా తీవ్రంగా ఖండిస్తుందని మోర్చా నాయకుడు భరత్ సింగ్ తెలిపారు. టి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వంలో న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. అన్యాయాలను ఎదిరించి న్యాయస్థానం ముందు దోషులుగా నిలబెట్టే న్యాయ వాదులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఈ ప్రభుత్వంలో ఎలా ఉందో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. వామన రావు దంపతుల హత్యకేసులో నిందితులు ఎంతటి వారైనా సరైన శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు పుస్తకాలు అందజేత

మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన : గురువారం రోజున ప్రాథమిక పాఠశాల బనిగండ్లపాడు కాలనీ నందు కరోనా కాలంలో విద్యార్థినీ విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని వారు అలా దూరం అవ్వకుండా ఆన్లైన్ క్లాసులు వింటూ వాటిని సమగ్రంగా విద్యార్థులకు చేరువయ్యేలా చెయ్యుటానికి విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగా గురునాథ రెడ్డి మరియు వారి సోదరి మణి టిఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు శీలం ఉమామహేశ్వరి గారి ఆర్థిక సహాయంతో 14000 రూపాయలతో వర్క్ షీట్ లు, పుస్తకాలను, కాపీరైట్స్ పుస్తకాలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో



సర్పంచ్ జంగా పుల్లా రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థులు కోవిడ్ కారణంగా విద్యకు దూరం అవ్వకుండా ఉండేందుకు సహకరిస్తున్న దాతలకు మరియు పాఠశాల సిబ్బంది కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జంగా పుల్లారెడ్డి గారు, టిఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు శీలం ఉమా మహేశ్వరి గారు, పెద్ద గోపవరం సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి గారు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ వేమిరెడ్డి పాపి రెడ్డి గారు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు బండారు వెంకట్ రావు గారు, అంగన్వాడీ టీచర్ మేరీ కాంతం, ఉపాధ్యాయులు గోలి, చిన్నప్ప, లక్ష్మీ, సుకన్య పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన : మధిర పట్టణంలో పదిహేనవ వార్డు నందు, టిఆర్ఎస్ నాయకులు పల్లపోతు ప్రసాద్ గారి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం లో భాగంగా పట్టణ వాసులు శ్రీమతి కోనా వాసవి గారిని పార్టీ సభ్యత్వం నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిఆర్ఎస్ నాయకులు బాధ్యులు శ్రీ పల్లపోతు వెంకటేశ్వర రావు గారు (కనుమూరు), వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షులు లికపిలవాయి జగన్ మోహన్ రావుమధిర పట్టణ టిఆర్ఎస్ నాయకులు.




ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | | | |
|---|---|---|---|---|
| తల్లనారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| శైలజ | - | శేర్లింగంపల్లి | - | 8919627871 |
| సత్య కిషోర్ | - | సిద్దిపేట | - | 6309723472 |


# సేవకై జీవించు - సేవకై తపించు

మధిర, ఫిబ్రవరి 18, ప్రజాపాలన :వాసవి ట్రస్ట్ (బెంగుళూరు) ఖమ్మం, వారి ఆధ్వర్యంలో శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం – గాంధీ చౌక్, ఖమ్మం, నందు కుట్టుమిషన్లు, గ్రైండర్లు లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమము. ఈరోజు వాసవి ట్రస్ట్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో, జిల్లా లో వివిధ పట్టణాలు కు చెందిన లబ్ధిదారులకు శ్రీ షిరిడి సాయిబాబా ఆలయము, పదవ వార్షికోత్సవం సందర్భంగా "వాసవి ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, గ్రైండర్లులు, పంపిణీ కార్యక్రమం నిమిత్తము "మధిర సేవా సమితి ఆధ్వర్యంలో" సెలెక్ట్ అయిన లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమము





గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రి శ్రీ పువ్వాడ అజయ్ గారు, ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ గార్ల చే ఖమ్మం పట్టణంలోని లబ్ధిదారులకు అందజేసినారు. మధిర సేవా సమితి వారు మధిర లబ్ధిదారులకు వాసవి ట్రస్ట్ ఆధ్వర్యంలో త్వరలో మధిర పట్టణమునందు ఇక్కడకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు తెప్పించి, అమౌంట్ చెల్లించిన సెలెక్ట్ అయిన పేదల లబ్ధిదారులకు త్వరలో పంపిణీ కార్యక్రమం చేపడతామని మదిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాద్ రావు గారు ఈ సందర్భంగా తెలిపారులి.మధిర ప్రాంతంలో సెలెక్ట్ అయిన లబ్ధిదారులు కు ఈ కార్యక్రమంలో అతిథులు మంత్రి పువ్వాడ అజయ్ గారు సినీ నటుడు శ్రీకాంత్ గారి చేతుల మీదుగా మధిర దరఖాస్తు చేసిన అందరి లబ్ధిదారులకు అలాట్మెంట్ చేసినారు. వీరిలో పర్శ బోయిన లక్ష్మి, కోమటి లత, ముక్కర శ్రీలత, తల్లం శైలజ, సిద్ధం శెట్టి ఉమాదేవి మరీదు కృష్ణవేణి లక్ష్మి ప్రభావతి నాగ సులోచన, పాల్గొన్నారులిఈ కార్యక్రమంలో లో శిరిడి సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షులు వేములపల్లి వెంకన్న గారు, మరియు కమిటీ సభ్యులు, ఖమ్మం వాసవి ట్రస్ట్ బృందం, సినీ నటుడు శివాజీ రాజా పాల్గొన్నారు మదిర సేవ సమితి ఉపాధ్యక్షులు కోమటిడి శ్రీనివాసరావు, కోశాధికారి యర్రా లక్ష్మణ్, గౌరవ సభ్యులు కోమటి సుధాకర్ పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు లాభాలు.. పేదల పై భారాలా



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల:18 ఫిబ్రవరి (ప్రజాపాలన) : ములకలపల్లి మండలం కేంద్రం పరిధిలోగల మాదారం గ్రామంలో జెడ్పిటిసి సున్నం నాగమణి నివాస గృహం దగ్గర సమావేశం నిర్వహించన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు విపరీతంగా పెంచుతూ ప్రజలపై పెనుభారం మోపుతున్నారని. వెంటనే ధరలు తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి అంజుమ్ ,ఓ బి సి అధ్యక్షుడు పుష్పాల హనుమంత్ రావు, కణితి సత్యనారాయణ, తాళ్ల చంటి, కన్నా చారి ,తదితరులు పాల్గొన్నారు.

# లాలాజలం తగ్గినా అల్సర్

కడుపులో ఎవరో కారం చల్లుతున్నట్టు మంట, పేగులు ఒరుసుకుపోతున్నట్టు నొప్పి. అల్సర్‌లతో కలిగే రోజువారీ అనుభవమిది. ఆహారపు అలవాట్లు, బ్యాక్టీరియా ఒక కారణమైతే, ఉరుకూ పరుగుల ఆధునిక జీవితం కూడా అల్సర్లకు మూలమవుతాయి. బాగా నమిలితినే తీరికా, ఓపికా లేకపోతే లాలాజలం అతితక్కువగా ఉత్పన్నమవుతుంది. లాలాజలం తగ్గితే ఆమ్లాలు పెరిగిపోయి అల్సర్‌లు మొదలవుతాయి. వాటంతట అవే తగ్గిపోతే సరేసరి. లేదంటే వెంటనే చికిత్స తీసుకోవాలంటున్నారు నిపుణులు. శరీరంలో ఒక నిర్ణీత పరిమాణంలో ఆమ్లం ఉండడం అవసరం. అందుకే ఆమ్లం ఎక్కువైతేనే కాదు తక్కువైనపడు కూడా అల్సర్లు తయారవుతాయి. అల్సర్లు రాకుండా కాపాడే ఒక రక్షణ వ్యవస్థ దెబ్బ తినడమే ఇందుకు కారణం. చిన్నపేగు ముఖ ద్వారం వద్ద తలెత్తే డియోడినల్ అల్సర్ ఒక సాధారణ సమస్య. ఇది చాలా ఎక్కువ మందిలో కనిపిస్తుంది. చాలా మందిలో ఈ అల్సర్ రావడానికి ఆమ్లమే కారణం. ఒక్కోసారి జీర్ణాశయంలోనూ అల్సర్ రావచ్చు. దీన్ని గ్యాస్ట్రిక్ అల్సర్ అంటారు.

హెలికో బ్యాక్టర్ ఫైలోరి అనే బ్యాక్టీరియా కూడా అల్సర్‌కు కారణమవుతుంది. సాధారణంగా ఇతర ఏ బ్యాక్టీరియా అయినా కడుపులోని ఆమ్లంతో చనిపోతుంది. కానీ ఈ ఒక్క బ్యాక్టీరియా మాత్రమే ఆమ్లాన్ని తట్టుకుని జీవిస్తుంది. పైగా ఆమ్లం అధిక ఉత్పత్తికి కూడా దోహదం చేస్తుంది. ఫలితంగా చిన్న పేగు అల్సర్లు ( డియోడినమ్ అల్సర్లు,) జీర్ణాశయ అల్సర్లు మొదలవుతాయి. ఆహార నాళంలో ఆమ్లం చేరిన వారికి రిఫ్లక్స్ ఈజోఫేకస్ అనే మరో సమస్య కూడా తలెత్తుతుంది. దీనివల్ల ఛాతీలో, గొంతులో నొప్పి మంటా ఉంటాయి.

**లాలాజలం తగ్గితే**

సహజంగా కడుపులోని ఆమ్లాలను అణచివేసే శక్తి లాలాజలంలో ఉంటుంది. అయితే ఆదరాబాదరాగా భోజనం చేసే ఆధునికుల్లో అంత లాలాజలం ఉత్పన్నం కాదు. ఉత్తర భారతీయులతో పోలిస్తే దక్షిణ భారతీయుల్లోనే అల్సర్ సమస్యలు ఎక్కువ. దానికి ఇరువురు తీసుకునే ఆహార వ్యత్యాసాలు కూడా కారణమే. మనకు అన్నం ప్రధానమైతే వారికి చపాతీ ప్రధానం. చపాతీ నమలడానికి వెచ్చించినంత సమయాన్ని చాలా మంది అన్నం నమలడానికి వెచ్చించరు. ఈ కారణంగా అవసరమైనంత లాలాజలం ఉత్పన్నం కాదు. దీని వల్ల కడుపులో ఆమ్లం పెరిగి అల్సర్‌కు దారి తీస్తుంది. ఆమ్లంతో సంబంధం లేకుండానే జీర్ణాశయంలో అల్సర్లు రావచ్చు. దీనికి అతిగా కారం, మసాలాలు తీసుకోవడం, పొగతాగడం, మద్యపానం వంటివి కారణం. కీళ్లనొపలకు వాడే మందుల దుష్ప్రభావం వల్ల కూడా పేగులు, లేదా పొట్టలోని మ్యూకస్ దెబ్బతిని అల్సర్లు మొదలవుతాయి. కానీ, చిన్న పేగు అల్సర్‌లకు మాత్రం ఆమ్లమే ప్రధాన కారణం.



**లక్షణాలు**

నొప్పి, మంట, రక్తస్రావం అల్సర్ ప్రధాన లక్షణాలు. 80 శాతం మందిలో ఈ లక్ష ణాలు కనిపిస్తాయి. మిగతా 20 శాతం మందిలో అల్సర్ ఉన్నా ఆ లక్షణాలే కనిపించవు. చిన్న పేగు అల్సర్ ఉంటే కడుపు ఖాళీగా ఉన్నపడు నొప్పి వస్తుంది. ఏమైనా తినగానే తాత్కాలికంగా తగ్గుతుంది. ఆ తరువాత కొద్దిసేపటికే మళ్లీ నొప్పి మొదలవుతుంది. తిన్నపడు ఆమ్లం గాఢత తగ్గుతుంది. అందుకే వెంటనే ఉపశమనం అనిపిస్తుంది. కానీ అన్నం కాస్త జీర్ణం కాగానే మళ్లీ నొప్పి, మంట మొదలవుతాయి. జీర్ణాశయంలో అల్సర్ ఉంటే అన్నం తినగానే కడుపులో నొప్పి మొదలవుతుంది.

జూ కొంమందిలో అల్సర్లు ఉన్నా నొప్పి మంట వంటి ఏ లక్షణాలూ ఉండవు. కానీ, అల్సర్లు రక్తనాళాలను దెబ్బ తీయడం వల్ల రక్తపు వాంతులు కావచ్చు. ఒక్కోసారి ఎక్కువ పరిమాణంలో రక్తం వాంతులై ప్రాణాపాయం కూడా ఏర్పడవచ్చు. అయితే ఈ రక్తం అల్సర్ వల్ల వచ్చిందా లేక మరో కారణంగా వచ్చిందా అన్నది ఎండోస్కోపి చేసేదాకా తెలియదు.

రక్తవాంతులకు అల్సర్లు కాకుండా మరికొన్ని ఇతర కారణాలు కూడా ఉన్నాయి. లివర్ వ్యాధి కారణంగా వైరస్ ఆహార నాళికను దెబ్బ తీసినపడు కూడా రక్తస్రావం కావచ్చు. కీళ్లనొపలకు వాడే మందులు కూడా కారణం కావచ్చు. అలాగే కడుపులో క్యాన్సర్ ఉన్నపడు కూడా రక్తస్రావం అవుతుంది. వాంతులే కాకుండా మల విసర్జన ద్వారా కూడా రక్తస్రావం కావచ్చు.

**ఆహార నియమాలు**

అల్సర్ వ చ్చినపడు ఉప, కారం, పులుపు పూర్తిగా మానుకోవలసిన అవసరం లేదు. ఒక మోస్తరుగా అన్నీ తీసుకోవ చ్చు. కాకపోతే పొగతాగడం, మధ్యపానం పూర్తిగా మానివేయడం మేలు. టీ, కాఫీలు బాగా తగ్గించాలి. అల్సర్ పేషంట్లలో ఆహార విషయాల్లో అంత తీవ్రమైన నియమాలేమీ అవసరం లేదు. పండ్లు కూడా తీసుకోవచ్చు. కాకపోతే మరీ ఎక్కువ పులుపు ఉన్న వాటిని మాత్రం తీసుకోకూడదు. మానసిక ఒత్తిళ్లు తగ్గడానికి ప్రతినిత్యం వ్యాయామం, ధ్యానం చేయడం అవసరం. ఆమ్లంతో బాగా నొప్పి మంట ఉన్నపడు నీరు తాగితే వెంటనే వెంటనే ఉపశమనం లభిస్తుంది. ఆమ్లంతో పాటు వీరిలో చాలా మందికి మలబద్ధకం కూడా ఉంటుంది. నీరు తాగడం వల్ల ఈ రెండు సమస్యలకు మేలు కలుగుతుంది. పీచు పదార్థం గల ఆహార పదార్థాలు, వీటిలో ఆకు కూరలు అధికంగా తీసుకోవాలి.

## మాడు దురదపెడుతోందా?



గాలిలో తేమ ఎక్కువగా ఉన్నా కూడా చర్మం పొడారిపోతుంది. అలాగే మాన్‌సూన్‌లో బ్యూటీకి సంబంధించి పలురకాల సమస్యలను ఎదుర్కొంటాం. ముఖ్యంగా మాడు దురదగా ఉంటుంది. తలలో చుండ్రు చేరుతుంది. ఆ చుండ్రు ముఖం మీద పడితే యాక్నే, మొటిమలు వచ్చే అవకాశం ఉంది. చర్మం మీద, మాడుపై నున్న ఒక రకమైన ఫంగస్ కారణంగా చుండ్రు సమస్య తలెత్తుతుంది. ఫలితంగా చర్మం దురదగా ఉండడంతోపాటు తల నూనెకారుతున్నట్టు ఉంటుంది. కోల్ తార్ ఉన్న షాంపుతో తలస్నానం చేస్తే చర్మంలోని మ ృతకణాలు పోతాయి. అంతకాదు చుండ్రువల్ల వచ్చే ఇన్‌ఫ్లమేషన్ కూడా తగ్గుతుంది. తలలో చుండ్రు ఎక్కువ కాకుండా వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ఆ చుండ్రు కనుబొమలకు, కనురెప్పలకు, చెవి వెనుక భాగాలకు, కొన్నిసార్లు ఛాతీ వరకూ కూడా వ్యాపించే అవకాశం ఉంది. సరైన పరిమాణంలో షాంపు తీసుకుని దానితో తల స్నానం చేస్తే ఈ సమస్యను అధిగమించవచ్చు. ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే తలకు ఎక్కువ నూనె పెట్టుకునే అలవాటు ఉంటే దానిని మానుకోవాలి. మాడు దురద తగ్గించుకోవడానికి వంటింటి చిట్కాలు కూడా లేకపోలేదు. ఉల్లిపాయలు, యాపిల్‌సిడార్ వెనిగర్, వెల్లుల్లి మిశ్రమాన్ని మాడుకు పట్టించి కాసేపు ఉంచుకుని తర్వాత నీళ్లతో బాగా కడిగేసుకోవాలి. తలంటుపోసుకున్న ప్రతిసారి మీరు వాడిన టవల్, దువ్వెన లాంటివి డిటర్జెంట్ నీళ్లల్లో నానబెట్టి శుభ్రంచేసుకోవాలి. అలా క్లీన్ చేసిన తర్వాత వాటిని యాంటిసెప్టిక్ లోషన్‌లో కాసేపు ఉంచాలి. ఆ తర్వాత నీళ్లతో వాటిని బాగా శుభ్రంచేసి ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల చర్మానికిగాని, తలకు ఎలాంటి ఇన్ఫెక్షన్లు సోకవు. శిరోజాలు సిల్కులా మెరవడానికి హెయిర్‌ప్యాక్స్ కూడా ఉన్నాయి. వీటిల్లో కలబంద యాంటిఇన్‌ఫ్లమేటరీగా పనిచేస్తుంది. నిమ్మలో ఎసిటిక్ యాసిడ్‌లాంటివి బాగా ఉంటాయి. ఇవి యాంటిసెప్టిక్, యాంటిఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. కొన్ని చుక్కల టీ ట్రీ ఆయిల్‌ని ఆముదం నూనెలో వేసి ఆ మిశ్రమాన్ని వారానికి ఒకటి లేదా రెండు సార్లు మాడు మీద రాసుకుంటే మంచి ఫలితాలుంటాయి. సో... మాన్‌సూన్ టైములో ఇలాంటి సమస్యలను ఎదుర్కొనేవాళ్లు ఈ చిన్న చిన్న చిట్కాలను చేసి చూడండి.

## ‘లంగ్ ఫ్లూట్’



క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సిఓపిడి)తో బాధపడేవాళ్లకు ఒక శుభవార్త. ఈ జబ్బు తీవ్రత పేషంట్లలో తగ్గడాని కోసం ‘లంగ్ ఫ్లూట్’ అనే కొత్త పరికరాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ రెస్పిరేటరీ డివైస్‌లోకి గాలిని గట్టిగా వదలడం ద్వారా ఊపిరితిత్తుల్లో ఉన్న మ్యూకస్‌ను తొలగించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. చేత్తో వాడే ఈ లంగ్ ఫ్లూట్ వల్ల సిఓపిడి లక్షణాలు తగ్గడమే కాదు రోగుల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అంతేకాదు దీనివల్ల రోగుల్లో దగ్గు, కళ్లె పడ్డం కూడా బాగా తగ్గుతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ స్టడీని సిఒపిడితో బాధపడుతున్న 69మంది పేషంట్లమీద 26 వారాల పాటు నిర్వహించారు. ‘లంగ్ ఫ్లూట్’ను ఉపయోగించని రోగుల్లో కన్నా ఈ సాధనాన్ని ఉపయోగిస్తున్న రోగుల్లో మెరుగైన ఫలితాలు కనిపించడాన్ని అధ్యయనకారులు గుర్తించారు. వెటరన్స్ అఫైర్స్ వెస్టన్ న్యూయార్క్ హెల్త్‌కేర్ సిస్టమ్ ఈ పరిశోధనలను నిర్వహించింది. ‘లంగ్ ఫ్లూట్’ పరికరం నైపుణ్యత, సామర్థ్యం, రక్షణ వ్యవస్థలపై కూడా శాస్త్రవేత్తలు పరీక్షలు నిర్వహించారు. అస్తమా లక్షణాలను నియంత్రించేలాగ కూడా ఈ పరికరాన్ని మలచడంపై ప్రస్తుతం పరి?శోధకులు ద ృష్టిసారించారు. క్షయ, లంగ్ కాన్సర్ వంటివి గుర్తించడంలో కూడా ఈ సాధనం ఉపయోగపడేలాగ అధ్యయనకారులు తమ పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

## క్షయ నియంత్రణకు కొత్త అణువు



మందులకు లొంగని స్థితికి చేరుకున్న క్షయ (టీబీ) వ్యాధిని నియంత్రించేందుకు శాస్త్రవేత్తలు ఓ కొత్త అణువును కనుగొన్నారు. దీంతో ప్రాణాంతక హెచ్ఐవీని కూడానియంత్రించవచ్చని వారు తెలిపారు. జార్జియా యూనివర్సిటీకి చెందిన ఈ పరిశోధకుల బ ృందంలో భారత సంతతి శాస్త్రవేత్త కూడా ఉండడం గమనార్హం. క్షయ చికిత్సలో ఉపయోగించే మందులకు ఇటీవలి కాలంలో క్రిములు రోగ నిరోధకత సంతరించుకోవడంతో టీబీ లొంగడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఈ తరహా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో శక్తిమంతమైన యాంటీబయాటిక్‌లకు సైతం కొరుకుడుపడని టీబీని తాము ఆవిష్కరించిన అణువుతో నియంత్రించవచ్చని ఈ పరిశోధనలో పాల్గొన్న వాసు నాయర్ వివరించారు.

## రెండేళ్లలో తొలి కృత్రిమ రక్త మార్పిడి



వచ్చే రెండేళ్లలో కృత్రిమ రక్త మార్పిడి ప్రయోగాత్మ కంగా పరిశీలించేందుకు యూకేలో ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఈ మేరకు ఆస్పత్రులలో వలంటీర్లకు కృత్రిమ రక్తాన్ని ఎక్కించి చూసేందుకు ప్రయత్ని స్తున్నట్లు ఎన్‌హెచ్ఎన్, బ్రిస్టల్ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారు. బొడ్డుతాడు నుంచి సేకరించిన మూలకణాలతో ఎర్రరక్త కణాలను విజయవంతంగా అభివ ృద్ధి చేశామని వారు వివరించారు. దీంతో తరచుగా రక్తమార్పిడి అవసరమయ్యే తలసేమియా, అనీమియా బాధితులకు ఉపశమనం కలిగించవచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే దాతల నుంచి సేకరించిన వాటితో పోలిస్తే ఈ కృత్రిమ ఎర్రరక్త కణాలు ఎంత సేపటి వరకు జీవించి ఉంటాయన్నదే తేలాల్సి ఉంది. ఇందుకోసం వలంటీర్లకు ఈ కృత్రిమ రక్తాన్ని ఎక్కించి పరీక్షించనున్నారు. రక్త దాతల కొరతకు ఈ కృత్రిమ రక్త కణాలు మంచి ప్రత్యామ్నాయమని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన డాక్టర్ నిక్ వాట్కిన్స్ వివరించారు.

## ఇబుప్రొఫెన్ మందుతో ఆల్జీమర్స్‌కు చెక్




కండరాల నొప్పులను తగ్గించేందుకు ఉపయోగించే ఇబుప్రొఫెన్ మందుతో అల్జీమర్స్ వ్యాధిని అరికట్టవచ్చని కెనడాకు చెందిన న్యూరాలజిస్టు పాట్రిక్ మెక్‌గీర్ చెప్పారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పురుషులైనా, మహిళలైనా ఇబుప్రొఫెన్ గుళికను రోజూ తీసుకుంటే అల్జీమర్స్ వ్యాధి దరిదాపులకు చేరదని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా అల్జీమర్స్ వ్యాధి 65 ఏళ్ల వయసు వారికి వస్తుంది. అయితే, లాలాజలాన్ని పరీక్షించడం ద్వారా అంతకు పదేళ్ల ముందే ఆ వ్యాధి లక్షణాలను గుర్తించవచ్చని పాట్రిక్ చెప్పారు.

# మెదడకు సర్జరీ ఎలా చేస్తారు



మెదడుకు సర్జరీ అంటే పుర్రె ఎముక మొత్తాన్ని ఒక డిప్పలాగా కట్ చేసి పక్కనపెట్టి మరీ ఆపరేషన్ చేస్తారనే అపోహ చాలామందిలో ఉంది. కానీ, అది పూర్తిగా అవాస్తవం. మెదడులో ఏ ప్రాంతంలో సమస్య ఉందో ముందే గుర్తిస్తారు కాబట్టి కేవలం ఆ భాగం దగ్గర మాత్రమే పుర్రెను కట్ చేసి మెదడు సర్జరీని పూర్తి చేస్తారు. నిజానికి మెదడులో సమస్య ఉందని తెలిస్తే భయంతో వణికిపోతాం. కానీ, వైద్యరంగంలో మెదడుపై ఎన్నో క్లిష్టమైన సర్జరీలను చేసి విజయం సాధిస్తున్న ‘న్యూరో సర్జరీ విభాగం’ మెదడు సర్జరీలపై ఉన్న భయాలను, అపోహలను మెల్లమెల్లగా పోగొడుతోంది. సాధారణంగా మెదడు సర్జరీలన్నీ జనరల్ అనస్థీషియా కిందే చేస్తారు. కానీ మెదడులోని కీలక ప్రాంతాల్లో కణుతుల్లాంటివి ఉంటే, అవసరాన్ని బట్టి అక్కడే మత్తు ఇచ్చి సర్జరీ చేస్తారు. మెదడు మీద కొన్ని ప్రాంతాల్లో చేత్తో ముట్టుకుంటే స్పర్శ తెలుస్తుంది కానీ, కొన్ని ప్రాంతాల్లో తెలియదు. సాధారణంగా మెదడులోని నాడీ కణాలన్నీ విద్యుత్ ప్రచోదనాలకే ఉత్తేజితమై ప్రేరణ పొందుతాయి. అందుకే మత్తుతో ఆపరేషన్ చేస్తుంటే అవసరాన్ని బట్టి కొన్ని మెదడు ప్రాంతాలను గుర్తించేందుకు కరెంట్‌తో ప్రేరేపిస్తుంటారు.

మాటలకు, సంభాషణకు కీలకమైన ‘బ్రోకాస్’ ప్రాంతానికి సర్జరీ చేయాల్సినప్పుడు ఎంత ప్రాంతం తొలగిస్తున్నామనేది ముఖ్యం. లేకపోతే సర్జరీ తర్వాత రోగి మాట్లాడలేకపోవచ్చు. అందుకే మత్తు ఇచ్చి, ఆపరేషన్ చేస్తూ.. రోగిని మాట్లాడమని, అంకెలు లెక్కించమని చెబుతూ బ్రోకాస్ ప్రాంతాన్ని కరెంట్‌తో ప్రేరేపిస్తారు. ఆ ప్రాంతం ప్రేరేపితమైతే వెంటనే లెక్కించటం ఆగిపోతుంది. ఆగిపో యిందంటే అది ‘బ్రోకాస్’ ప్రాంతమని గుర్తించి, ఆ ప్రాంతంలో కణితి ఉన్నా, దాన్ని ముట్టుకోకుండా మిగతా ప్రాంతంలోని కణితిని తొలగించి సర్జరీ పూర్తి చేస్తారు.

మెదడులోని కొంత ప్రాంతాన్ని తొలగిస్తే రోగికి మానసిక సమస్యలు తలెత్తుతాయని, పిచ్చి వాళ్లవుతారని చాలామంది భయపడుతుం టారు. అది నిజం కాదు. కొన్ని భాగాలను తొలగిం చినప్పుడు ఆ ప్రాంతం నిర్వహించే పనులను మెదడులోని మిగతా భాగాలు చేపడుతుంటాయి. కాబట్టి చాలా మందిలో పెద్ద తేడా కనిపించదు. మెదడుకు ఈ సర్దుబాటు శక్తి ఉంది. కీలక ప్రాంతాలు తప్పించి, మిగతా మెదడులో కణుతులు వచ్చినప్పుడు కొద్దిభాగం తొలిగించినా కూడా సాధారణ జీవితానికేమీ ఇబ్బంది ఉండదు.

**చికిత్స తీరుతెన్నులు**

ముందుగా మెదడులో ఏ ప్రాంతానికి సర్జరీ చేయాలో కచ్చితంగా గుర్తిస్తారు. ఆ ప్రాంతంలో తలపై చర్మాన్ని ఒలుస్తారు. తరువాతర ఆధునిక పరికరాలతో ఆ ప్రాంతం పుర్రె ఎముకకు కోతబెట్టి దాన్ని తీసి పక్కన పెడతారు. పుర్రె ఎముక తీయగానే కింద మెనింజెస్ అనే పొరలు కనపడతాయి. వాటిని కత్తిరించి ఒక వైపుకు తీస్తే కింద ద్రవంలో మెదడు ప్రత్యక్షంగా కనపడుతుంది. దానిపైన సర్జరీ పూర్తి చేస్తారు. వెంటనే మళ్లీ మెనింజెస్‌ను కప్పి కుట్టేసి ఎముకను తెచ్చి యథాస్థానంలో అమరుస్తారు. దానిపైన చర్మాన్ని మూసి కుట్టేస్తారు. మనం ఒంటి మీద చర్మం ఎక్కడైనా కట్ చేస్తే క్రమేపీ అది పూడుకుపోతుంది. కానీ మెదడు ఇలా కాదు. అందుకే ఎప్పుడూ కూడా మెదడులో అంతగా ప్రాధాన్యం లేని ప్రాంతాల ద్వారానే సర్జరీ చేయాలని చూస్తుంటారు.

మెదడు సర్జరీలలో 90 శాతం విజయవంతంగా పూర్తవుతున్నాయి. ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండటం లేదు. మిగిలిన 10 శాతం కేసుల్లో కొన్ని దుష్ప్రభావాలు తలెత్తవచ్చు. ఇతర సర్జరీలతో పోలిస్తే మెదడు సర్జరీలతో సైడ్ ఎఫెక్టులు తలెత్తే అవకాశం కాస్త ఎక్కువే. కాకపోతే అవన్నీ తాత్కాలికం అని విషయం గమనించాలి. తక్షణమే ఎదుర్కొనే దుష్ప్రభావాలు కొన్ని ఉన్నాయి. వాటిలో మొదటిది మగత. సర్జరీ సమయంలో ఏదైనా తేడా వస్తే రోగి మత్తు నుండి త్వరగా బయటకు రాలేకపోవచ్చు. లేదంటే స్పృహకు కీలకమైన హైపసోథాలమస్ వంటివి దెబ్బతింటే 5 రోజులు మగతగా ఉంటారు. ఇలాంటి వారిని కొద్ది రోజులు ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తే క్రమంగా మెలకువలోకి వస్తారు. అలాగే సర్జరీ సమయంలో మెదడు చిరాకుగా ఉంటుంది. ఫలితంగా సర్జరీ తర్వాత ఫిట్స్ రావచ్చు. అందుకే మూర్ఛ రాకుండా మందులు వాడమని సూచిస్తారు వైద్యులు. కొన్నిసార్లు సర్జరీ తరువాత బీపీ పెరగటం వల్ల మెదడులో రక్తస్రావం కావచ్చు. శరీరంలోని మిగతా భాగాల్లో అయితే సర్జరీ సమయంలో రక్తనాళాలను కట్టడం, నొక్కటం వంటి చేసి రక్తస్రావం ఆపొచ్చు. కానీ మెదడులో సూక్ష్మమైన రక్తనాళాలుంటాయి కాబట్టి, అది సాధ్యం కాదు. అందుకే సర్జరీ సమయంలో రసాయనాలతో ఆపేస్తారు.



# నాకు సినిమాలు వద్దు.. నా లక్ష్యం వేరే..

## మిస్ ఇండియా మానస వారణాసి




మిస్ ఇండియా గెల్చుకుని హైదరాబాద్‌లో పుట్టింటికి వచ్చిన తెలంగాణ నిసర్గ సౌందర్యం మానస వారణాసికి శంషాబాద్ విమానాశ్రయంలోనూ, అపార్ట్‌మెంట్‌లోనూ ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ అతి పెద్ద చాలెంజ్ అయిన మిస్ ఇండియాను సొంతం చేసుకోవడానికి అమ్మానాన్న, స్నేహితులు, అందరూ తమవంతు సహకారం అందించారని చెప్పారు. సౌందర్యపోటీల్లో భారత్‌ను అంతర్జాతీయ వేదికపై నిలబెట్టేందుకు కృషి చేస్తానని, ఇప్పుడు నా లక్ష్యం మిస్ వరల్డ్ మాత్రమే తప్ప సినిమా అవకాశాల జోలికి వెళ్లనని మానస చెప్పారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో అడుగుపెట్టిన మిస్ ఇండియా టైటిల్ విజేత మానస వారణాసికి అపూర్వ సాగతం లభించింది. ఫిబ్రవరి 10న ముంబైలో జరిగిన వివిఎల్‌సీసీ ఫెమీనా మిస్ ఇండియా 2020 పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన మానస కొన్ని వారాల తర్వాత సొంత నగరానికి, ఇంటికీ రావడం, కుటుంబంతో తిరిగి కలవడంతో మహదానందాన్ని పొందారు. ఈ సందర్భంగా మానస మీడియాతో తన



తర్వాత నగరంలోని సొంతింటికి వచ్చానని,. మిస్ ఇండియా పోటీలో నిలిచేందుకు ఎంతోకాలం నిరీక్షించాననీ, ముంబై వెళ్లి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో ఉంటూ ఎంతో కష్టపడి పోటీలకు సన్నద్ధమయ్యానని చెప్పారు. మిస్ ఇండియా ఓ బిగ్ చాలెంజ్. దానిని సొంతం చేసుకోవడం సంతోషంగా ఉంది. ఈ ప్లాట్‌ఫాం వైపు స్నేహితులు ఎంతగానో ప్రోత్సహించారు. మా అమ్మానాన్న సైతం ఆ దిశగా ముందుకు నడిపించారు. ఇప్పుడు వారెంతో సంతోషపడుతున్నారని మానస పేర్కొన్నారు.. ఇండియాను ఇంటర్నేషనల్ ప్లాట్‌ఫాంపై నిలబెట్టేందుకు కృషి చేస్తా. సినిమా అవకాశాలు ప్రస్తుతానికి వాటి జోలికి వెళ్లను. నా లక్ష్యం మిస్‌వరల్డ్ మాత్రమే అని మానస చెప్పారు. అంతకుముందు శంషాబాద్ ఆత్మీయులు, అభిమానులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మానస వారణాసి మీడియాతో మాట్లాడుతూ.. మిస్ ఇండియా పోటీల్లో వివిధ రాష్ట్రాల అమ్మాయిలతో కలిసి ఉన్నానని, మంచి వాతావరణంలో పోటీలు జరిగాయన్నారు. వలంటీర్‌గా తాను పనిచేసిన అనుభవం కూడా తన విజయానికి దోహదపడిందన్నారు. తర్వాత అశోక్‌నగర్ వీధి నంబర్ 2లోని తన నివాసానికి మానస చేరుకున్నారు. తల్లిదండ్రులు శైలజ, రవిశంకర్, చెల్లెలు మేఘన, అమ్మమ్మ గరికపాటి అన్నపూర్ణ, స్నేహితులు, అపార్ట్‌మెంట్‌వాసులు ఆమెకు స్వాగతం పలికారు. మిస్ ఇండియా మానసను చూడగానే అశోక్‌నగర్‌లోని స్ట్రీట్ నంబర్ వాసులు, లెజెండ్ అపార్ట్‌మెంట్ వాసులు ఆమెపై పూలవర్షం కురిపించి సత్కరించారు. డప్పు దరువులకనుగుణంగా చిన్నారులతో కలిసి ఆమె డ్యాన్స్ చేయడం అందరినీ అలరించింది. స్నేహితులు, బంధువులు పూల బొకేలతో మానసను అభినందించారు. ఆమెతో సెల్ఫీలు దిగారు. ఇంటినుంచి దూరంగా వెళ్లాక అమ్మమ్మ చేతి వంటను మిస్సయ్యాను. అందుకే హైదరాబాద్‌లో దిగగానే అమ్మమ్మను గట్టిగా కౌగలించుకుని ఇంట్లో తయారు చేసిన రకరకాల వంటకాలు తినాలనుకున్నాను అని మానస చెప్పారు. విమానాశ్రయం నుంచి అయిదు కిలోమీటర్ల దూరం బైక్ ర్యాలీతో ఇంటిదారిపట్టిన మానసకు దారిపొడవునా స్వాగత సత్కారం లభించింది. మానస సోదరి మేఘన, స్నేహితులు డ్యాన్స్ చేస్తూ ఆమెకు స్వాగతం పలికారు.

# ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 26న MMOF ఉరఫ్ 70ఎంఎం చిత్రం విడుదల




శ్రీమతి అనుశ్రీ ప్రజెంట్ ఆర్ ఆర్ ఆర్ ప్రొడక్షన్స్ & జె కే క్రియేషన్స్ పతాకంపై జె డి చక్రవర్తి హీరోగాహా ఎన్.ఎస్ సిహా దర్శకత్వంలోహా రాజశేఖర్ ,ఖాసీం లు నిర్మిస్తున్న చిత్రం యమ్.యమ్.ఓ.యఫ్. ఉరఫ్ 70 యమ్. యమ్. ఈ నెల 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈహా సందర్భంగా జెడి చక్రవర్తి మాట్లాడుతూ ..యమ్. యమ్. ఓ.యఫ్‌హా టైటిల్ని తీసివేయమని అందరూ అడుగుతున్నారు. ఈ టైటిల్ కు అర్థం ఏంటనేదిహా విడుదలకు ముందు తెలియజేద్దాం అని ఆగాము. ఇది పూర్తిగా కాన్సెప్ట్ ఓరియంటెడ్ ఫిల్మ్. కరోనా రావడం వల్ల సినిమా లేట్ అయినాహా ప్రొడ్యూసర్లకు ఓ.టి.టి ల వలన మంచి జరగుతుందని ఆశిస్తున్నాను. నిర్మాతలు ఈ చిత్రం కోసంహా భారాన్ని మించిన బరువులు మోశారు..యమ్. యమ్. ఓ.యఫ్ అనేది రిఫ్లెక్షన్ లో వస్తే 70 ఎంఎం సినిమా పేరు. ఈనెల 26న విడుదలవుతున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. నిర్మాతలు రాజశేఖర్ ,ఖాసీం లు మాట్లాడుతూ.. యమ్. యమ్. ఓ.యఫ్‌హా మర్డర్ మిస్టరీ ఆఫ్ ఫ్యామిలీ,మనీ మనీ ఆఫ్ ఫ్రెండా అని చాలామంది టైటిల్ గురించి ఫోన్ చేసి అడుగు తున్నారు.అందరి డౌట్స్ జె.డి




గారు క్లియర్ చేసి యమ్. ఓ.యఫ్ అనేది రిఫ్లెక్షన్ లో వస్తే 70ఎంఎం సినిమా పేరు అన్నారు. ఈ నెల 26న విడుదల అవుతుంది ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను అన్నారు. నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ సినిమా ట్రైలర్‌ను చూసి చాలామంది డిస్ట్రిబ్యూటర్లు నాకు ఫోన్ చేస్తున్నారు. నేనుహా ఒక నిర్మాత అయినా సినిమా ట్రైలర్ నచ్చి ప్రమోట్ చేయడానికి వచ్చాను. ఒక సినిమా ప్రేక్షకులను థియేటర్ దగ్గరికి తీసుకొచ్చేది టైటిల్ మాత్రమే, అలా వచ్చిన ప్రేక్షకులు సినిమా బాగుంటే పదిమందికి చెప్పి చిత్రాన్ని సూపర్ హిట్ చేస్తారు.ఈ చిత్రం కోసం దర్శక నిర్మాతలు ఎంతో కష్టపడ్డారు. తాజ్ మహల్ కట్టడానికి అప్పట్లో ఎంత మంది కష్టపడ్డారో అలాగే ఈ సినిమాను కూడా దర్శక నిర్మాతలు తాజ్ మహల్ లా తీర్చిదిద్దారు. సినిమా బాగా వచ్చింది కాబట్టిహా ఇప్పుడు ఆ కష్టాన్ని మర్చిపోయారు. టైటిల్ పై నాకు కొంచెం కన్ఫ్యూజన్ ఉండేది జె.డి చక్రవర్తి గారు నాకున్న కన్ఫ్యూజన్ ను క్లియర్ చేసి యమ్. ఓ.యఫ్ అనేది రిఫ్లెక్షన్ లో వస్తే 70ఎంఎం సినిమా పేరు అన్నారు. 70 ఎంఎం టైటిల్ చాలా బాగుంది. కొత్త వారితో తీసిన ఉప్పెన సినిమా సూపర్ హిట్ బాయ్ 100 కోట్ల కలెక్షన్ చేస్తుంది చేసింది. ఆ సినిమా లాగే ఈ సినిమా విడుదలై పెద్ద విజయం సాధించాలని అన్నారు.

నటీనటులు

జె.డి చక్రవర్తి, బెనర్జీ ,కిరాక్ ఆర్పీ, చమ్మక్ చంద్ర అక్షిత ముద్గల్ అక్షత శ్రీనివాస్ టార్జాన్,మనోజ్ నందన్, శ్రీ రామచంద్ర , రాజీవ్

సాంకేతిక నిపుణులు

టైటిల్.. యమ్. యమ్. ఓ.యఫ్
ప్రెసెంట్స్.. శ్రీమతి అనుశ్రీ
ప్రొడ్యూసర్స్.. రాజ శేఖర్, ఖాసీం
దర్శకత్వం ..ఎన్ యస్.సి.
కో–ప్రొడ్యూసర్స్ ..బండి శివ, గుడిపాటి రవి
మ్యూజిక్.. సాయి కార్తీక్
పి.ఆర్.ఓ..ఏలూరు శ్రీను,మేఘ శ్యామ్
సినిమాటోగ్రఫీ ..ఆకుల శివ
కెమెరామెన్.. అంజి
డైలాగ్స్.. రాఘవ
ఎడిటర్.. ఆవుల వెంకటేష్

# శంకర్ రేంజ్ తగ్గిందా.. రామ్ చరణ్ రేంజ్ పెరిగిందా




ఏంది తగ్గేది.. టాలీవుడ్ బడా స్టార్ మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తో మూవీ చేస్తుంటే.. శంకర్ రేంజ్ తగ్గేది ఏంటి చెప్పండి అనే డైలాగ్ వినిపించొచ్చు. కానీ.. రామ్ చరణ్ రేంజ్ పెద్దదే. కానీ.. రామ్ చరణ్ తెలుగులో బడా స్టార్. కానీ.. తమిళ్ లో రామ్ చరణ్ కి స్టార్ డమ్ లేదు. నోన్ హీరో కావచ్చు కానీ.. సెపరేట్ మార్కెట్ అంటూ ఏం లేదు. రాజమౌళినే.. బాహుబలి తర్వాత.. ఇలాంటి స్టార్లని ఇద్దర్ని జత చేశాడు. అయినా.. కొన్ని కామెంట్స్ వినిపించాయి. ఆ లెక్కన.. శంకర్ ఎప్పటి నుంచో ఇంకా పెద్ద స్టార్. నేషనల్ వైడ్ గా దశాబ్దం నుంచి.. స్టార్ డమ్ ఉంది. అయినా సరే.. ఒక రీజినల్ లాంగ్వేజ్ స్టార్ హీరోతో సినిమా చేస్తున్నాడు అంటే.. కాస్త ఆలోచించాల్సిందే. అదీ కాక.. అటు విజయ్, సూర్య, అజిత్ లాంటి వాళ్లు అయితే.. ఆ లెక్క వేరే. వాళ్లకి తెలుగులో మళయాలంలో కూడా మార్కెట్ ఉంది. కానీ.. మన రామ్ చరణ్ తెలుగు బడా స్టార్ అందులో నో డౌట్. కానీ. బాలీవుడ్ లో క్రేజ్ లేదు. మళయాలంలో కూడా పెద్దస్టార్ డమ్ అయితే లేదు. అయినా.. శంకర్ ఒప్పుకున్నాడు.

ఇకపోతే.. హీరోయిన్ విషయంలో కూడా అదే జరిగింది. త్రిబుల్ ఆర్ మూవీలో.. రామ్ చరణ్ కి బాలీవుడ్ స్టార్ హీరోయిన్.. అలియా భట్ ని జత చేశాడు రాజమౌళి. మరి మౌళి లెక్క అంతే. బాలీవుడ్ స్టార్స్ చాలా మందిని దింపుతున్నాడు కదా. బాలీవుడ్ ని కూడా షేక్ చేయాలని ప్లాన్ చేస్తున్నాడు కదా. అందుకే.. బాలీవుడ్ బ్యూటీని పట్టారు. మరి రష్మిక మందన్నాతో రామ్ చరణ్ జోడీ అంటే.. అక్కడ మ్యాచింగ్ తగ్గుతోంది. రష్మికాకి బాలీవుడ్ లో క్రేజ్ లేదు. సౌత్ లో ఓకే కానీ... నార్త్ సైడ్ ఆమెకి ఫేమ్ లేదు. బట్.. తెలుగు ఆడియన్స్ వరకు.. ఈ జోడీకి ఎదురే లేదు. బట్.. నార్త్ సైడ్ వర్కవుట్ కావాలి అంటే మాత్రం.. బాలీవుడ్ బ్యూటీని పట్టుకురావాలి. ముందుగా అలాంటి వార్తలే వచ్చాయి. కానీ.. శంకర్ కాంప్రమైజ్ అయినట్లు కనిపిస్తున్నాడు.

సఖి.. రీ..రీ ఎంట్రీ.. 20 ఏళ్ల తర్వాత మణిరత్నంతో

అసలు రామ్ చరణ్ కి ఏం తక్కువ అనే ఇంకో యాంగిల్ ఉంది. తెలుగులో స్టార్ హీరో రామ్ చరణ్.. తమిళ్ వాళ్లకి నోన్ హీరో.. బాలీవుడ్ కి కూడా నోన్ హీరో. వీరిద్దరి మూవీ వచ్చేది త్రిబుల్ ఆర్ మూవీ తర్వాత.. సో.. రాజమౌళి మూవీ కావడంతో.. త్రిబుల్ ఆర్ రేంజ్ ఓ లెవల్ లో ఉంటుంది. బాలీవుడ్ ని కూడా షేక్ చేస్తుంది. సో.. రామ్ చరణ్ రేంజ్ ఇంకాస్త పెరుగుతుంది. సో.. మ్యాచ్ బాలీవుడ్ లో శంకర్ కి ఎలాగూ పేరుంది. రామ్ చరణ్ కి కూడా స్టార్ డమ్ వస్తే.. దూసుకెళ్తుంది మూవీ. కానీ.. ఎక్కడో ఏదో తేడా కొడుతుంది అనే టాక్ అయితే ఉంది. శంకర్ బడ్జెట్ లు.. ఆయనకి ఎదురవుతున్న ఫ్లాప్స్ వల్ల.. తను కూడా కాస్త కాంప్రమైజ్ అవుతున్నట్లే కనిపిస్తున్నాడు. ఇక దిల్ రాజు కదా.. కాంప్రమైజ్ చేస్తుంటాడులే అనే టాకూ ఉంది. మరి దిల్ రాజు అంటే.. పావలా పావలా లెక్కేస్తాడాయే.. శంకర్ ఏమో.. కోట్లు కోట్లు ఖర్చు పెట్టేస్తాడాయే.. ఎట్టా సెట్ అవుతుందో ఏమో అనే వాళ్లూ ఉన్నారు. అయినప్పుడు చూద్దాం లే అనే కామెంట్లూ ఉన్నయ్.. బట్.. రామ్ చరణ్ మూవీ ఆగడం అనేది ఇంపాజిబుల్ కదా.

# ఉప్పెన గాళ్ కి ఇస్మార్ట్ హీరో ఝులక్!



ఉప్పెన చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది కన్నడ బ్యూటీ కృతి శెట్టి. నటించిన తొలి సినిమాతోనే సంచలనంగా మారింది. ఉప్పెన పరిశ్రమలో ఎన్నో రికార్డుల్ని కొల్లగొట్టింది. యువనాయిక కృతిపై ఆరంభమే గోల్డెన్ హ్యాండ్ అన్న ముద్ర పడిపోయింది. ఇక తనదైన నటన అభినయంతో కుర్రాళ్ల గుండెల్ని దోచిన ఈ భామను వెతుక్కుంటూ ఇటీవల పలువురు దర్శకనిర్మాతలు తన ఇంటి చుట్టూ తిరిగేస్తున్నారని విన్నాం. ఇప్పటికే సుధీర్ బాబు –ఇంద్రగంటి కాంబినేషన్ మూవీలో నటిస్తోంది. అలాగే నాని సరసన శ్యామ్ సింగరాయ్ లోనూ ఈ భామ కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమాల చిత్రీకరణలు సాగుతున్నాయి. ఇదిలా ఉండగానే ఉప్పెన గాళ్ అదిరిపోయే ఇస్మార్ట్ ఆఫర్ దక్కించుకుందని తెలిసింది. తాజా సమాచారం ప్రకారం.. ఇస్మార్ట్ ఎనర్జిటిక్ హీరో రామ్ సరసన కృతి కథానాయికగా నటించనుందని తెలుస్తోంది. అది కూడా తమిళ స్టార్ డైరెక్టర్ లింగుస్వామి దర్శకత్వం వహించబోయే చిత్రంలో. ఒకవేళ ఇదే నిజమైతే తన కెరీర్ లో మరో అద్భుత అవకాశం దక్కించుకుందనే భావించవచ్చు. రామ్ తో పర్ఫెక్ట్ మాస్ ఎంటర్ టైనర్ ని లింగుస్వామి తెరకెక్కించనున్నారు. ఇది తెలుగు–తమిళ్ ద్విభాషా చిత్రంగా రిలీజ్ కానుంది. శ్రీనివాస చిత్తూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. రెడ్ తర్వాత మరో సినిమాకి సంతకం చేసేందుకు రామ్ చాలా సమయం తీసుకున్న సంగతి తెలిసిందే.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part ‘A’), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989